జూలై 15, 2015

# కావలికోట

యెహోవా రాజ్యాన్ని ప్రకటిస్తోంది



## అధ్యయన ఆర్టికల్స్


ఆగస్టు 31–సెప్టెంబరు 6
ఆధ్యాత్మిక పరదైసును అందంగా తీర్చిదిద్దండి
7వ పేజీ

సెప్టెంబరు 7-13
‘మీ విడుదల సమీపించింది’!
14వ పేజీ

సెప్టెంబరు 14-20
దేవుని రాజ్యానికి నమ్మకంగా ఉండండి
22వ పేజీ

సెప్టెంబరు 21-27
ఇది మన ఆరాధనా మందిరం
27వ పేజీ



## రష్యా

**ముఖచిత్రం:** విస్తారమైన సైబీరియన్ ప్రాంతంలోని మారుమూల ప్రదేశాల్లో పరిచర్య చేస్తూ, మధ్యాహ్నం భోజనం చేస్తున్న సహోదరసహోదరీలు

జనాభా
**14,39,30,000**

ప్రచారకులు
**1,71,268**

## ఇంకా ఈ సంచికలో


3 తమ జీవితాల్ని సంతోషంగా అంకితం చేశారు—రష్యాలో

12 'దుర్దినాల్లో' సంతోషంగా యెహోవాను సేవించండి

20 మీరు చేస్తున్న పనిని మనుషులు గుర్తించాలా?

32 మీకిది తెలుసా?


# అధ్యయన ఆర్టికల్స్

## ■ ఆధ్యాత్మిక పరదైసును అందంగా తీర్చిదిద్దండి

యెహోవా ప్రజలు, ఆయన సంస్థలోని భూమ్మీద భాగంలో ఉన్న ఆధ్యాత్మిక పరదైసును ఆనందిస్తారు. యెహోవా చేసిన ఈ ఏర్పాటుపట్ల మనకు కృతజ్ఞత ఉందని ఎలా చూపించవచ్చు? దాన్ని విస్తరింపజేయడానికి వ్యక్తిగతంగా మనమేమి చేయవచ్చు? ఈ ఆర్టికల్‌లో వీటి గురించి చర్చిస్తాం.

## ■ 'మీ విడుదల సమీపించింది'!

ముందుముందు జరగబోయే ఉత్తేజకరమైన సంఘటనల గురించి ఈ ఆర్టికల్ వివరిస్తుంది. అంతేకాదు, దేవుని ప్రజలు మహాశ్రమల్ని ధైర్యంగా ఎందుకు ఎదుర్కోవచ్చో కూడా వివరిస్తుంది.

## ■ దేవుని రాజ్యానికి నమ్మకంగా ఉండండి

సాతాను లోకంలోని ప్రజలు తమ దేశానికి, సంస్కృతికి, జాతికి నమ్మకంగా ఉంటారు. కానీ మనం మాత్రం యెహోవాకు నమ్మకంగా ఉంటామని మాటిచ్చాం. ఈ లోక పోరాటాల్లో మనమెందుకు తలదూర్చమో ఈ ఆర్టికల్‌లో చూస్తాం. తటస్థంగా ఉండేలా మన మనసుకు, మనస్సాక్షికి ఎలా శిక్షణ ఇవ్వవచ్చో కూడా పరిశీలిస్తాం.

## ■ ఇది మన ఆరాధనా మందిరం

యెహోవా ప్రజలు, ఆయన్ను ఆరాధించడానికి వేలాది రాజ్యమందిరాల్లో లేదా ఇతర స్థలాల్లో కలుసుకుంటారు. ఈ ఆరాధనా మందిరాల పట్ల గౌరవం చూపిస్తూ, వాటి నిర్మాణానికి మద్దతిస్తూ, వాటిని సరైన స్థితిలో ఉంచడం ద్వారా మనం యెహోవాను మహిమపరుస్తాం. అందుకు ఉపయోగపడే బైబిలు సూత్రాలను ఈ ఆర్టికల్‌లో చూస్తాం.


**కావలికోట**
యెహోవా రాజ్యాన్ని ప్రకటిస్తోంది

జూలై 15, 2015
Vol. 136, No. 14 Monthly and Supplemental quarterly editions TELUGU July 15, 2015

ఈ ప్రచురణ అమ్మకానికి కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న బైబిలు విద్యాపనిలో భాగంగా స్వచ్ఛంద విరాళాల సహాయంతో ప్రచురించబడుతోంది. ప్రత్యేకంగా సూచించబడని లేఖనాలు పరిశుద్ధ గ్రంథము నుండి ఉల్లేఖించబడ్డాయి. కొన్ని లేఖనాల్లో విషయాన్ని నొక్కి చెప్పడానికి **ఏటవాలుగావున్న ముద్దక్షరాలు** ఉపయోగించబడ్డాయి. లేఖనం ఉన్నచోట *NW* అని ఉంటే అది ఆధునిక ఇంగ్లీషు భాషలోని పరిశుద్ధ లేఖనముల నూతనలోక అనువాదము నుండి అనువదించబడిందని అర్థం.

Published and Printed by The Watch Tower Bible and Tract Society of India at 927/1 Addevishwanathapura, Rajanukunte, Bangalore 561 203, Karnataka. **మీ ఉత్తరాలను ఈ చిరునామాకు పంపించండి:** Post Box No. 6441, Yelahanka, Bangalore 560 064, Karnataka.

© 2015 Watch Tower Bible and Tract Society of Pennsylvania.
Printed in India.

# రష్యాలో



రష్యాలో యెహోవాసాక్షుల కార్యకలాపాలపై ఎంతోకాలంగా ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం 1991లో ఎత్తివేసి, వాళ్లను అధికారికంగా గుర్తించినప్పుడు అక్కడి సాక్షులు ఎంతో సంతోషించారు. ఆ దేశంలోని సాక్షుల సంఖ్య పది రెట్లు పెరుగుతుందని అప్పట్లో ఎవరూ ఊహించి ఉండరు. ఇప్పుడు రష్యాలో దాదాపు 1,70,000 మంది సాక్షులు ఉత్సాహంగా ప్రకటిస్తున్నారు. వాళ్లలో, వేరే దేశాల నుండి రష్యాకు వచ్చి కోతపనిలో సహాయం చేస్తున్న సహోదరసహోదరీలు కూడా ఉన్నారు. (మత్త. 9:37, 38) వాళ్లలో కొంతమందిని పరిచయం చేసుకుందాం.

## సంఘాల్ని బలపర్చడానికి సహోదరులు ముందుకొచ్చారు

ముందు **బ్రిటన్**కు చెందిన **మాథ్యూ** గురించి చూద్దాం. రష్యాలో నిషేధం ఎత్తివేసే సమయానికి ఆయనకు 28 ఏళ్లు. ఆ సంవత్సరంలో జరిగిన ఓ సమావేశంలో, తూర్పు యూరప్‌లోని సంఘాల్లో అవసరం ఎక్కువ ఉందని ఆయన విన్నాడు. రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న సంఘం గురించి ఓ ప్రసంగీకుడు చెప్పాడు. ఆ సంఘంలో ఒకే ఒక్క పరిచర్య సేవకుడు ఉన్నాడు, సంఘపెద్దలు ఎవరూ లేరు, అయినా అక్కడి ప్రచారకులు కొన్ని వందల బైబిలు స్టడీలు చేస్తున్నారు. మాథ్యూ ఇలా అంటున్నాడు, "ఆ ప్రసంగం విన్న తర్వాత రష్యా గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. దాంతో అక్కడికి వెళ్లి సేవ చేయాలనే నా కోరిక గురించి యెహోవాకు ప్రార్థించాను." ఆయన కొంత డబ్బు దాచుకుని, చాలా వస్తువుల్ని అమ్మేసి 1992లో రష్యాకు వెళ్లాడు. ఆ తర్వాత ఏమి జరిగింది?

మాథ్యూ



ఆయనిలా చెప్తున్నాడు, "అక్కడి భాష నేర్చుకోవడం నాకు కష్టమైంది. నేను దేవుని గురించి ఇతరులతో సరిగ్గా మాట్లాడలేకపోయేవాణ్ణి." ఉండడానికి ఇల్లు దొరకడం కూడా కష్టమైంది. "తక్కువ సమయంలో నేను ఎన్నిసార్లు ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చిందో లెక్కలేదు" అని ఆయన చెప్తున్నాడు. మొదట్లో అలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కొన్నా మాథ్యూ ఇలా చెప్తున్నాడు, "రష్యాకు వెళ్లి సేవ చేయాలనుకోవడం నేను తీసుకున్న ఉత్తమ నిర్ణయం. దానివల్ల యెహోవాపై ఇంకా ఎక్కువగా ఆధారపడడం నేర్చుకున్నాను. ఆయన ఎన్నో విధాలుగా నన్ను నడిపించడం చూశాను." ఆ తర్వాత సంఘపెద్దగా, ప్రత్యేక పయినీరుగా సేవచేసిన మాథ్యూ ప్రస్తుతం సెయింట్ పీటర్స్‌బర్గ్ దగ్గరున్న బ్రాంచి కార్యాలయంలో సేవ చేస్తున్నాడు.

**జపాన్**కు చెందిన **హిరూ** 1999లో పరిచర్య శిక్షణా పాఠశాలకు హాజరయ్యాడు. అప్పుడు ఆయనకు 25 ఏళ్లు. ఆ పాఠశాల



హిరూ, స్విట్లాన

ఉపదేశకుల్లో ఒకరు, వేరే దేశాల్లో సేవచేయమని హిరూని ప్రోత్సహించాడు. రష్యాలో అవసరం ఎక్కువుందని తెలుసుకున్న హిరూ, రష్యన్ భాష నేర్చుకోవడం మొదలుపెట్టాడు. ఆయన మరో ముఖ్యమైన పని కూడా చేశాడు. ఆయనిలా చెప్తున్నాడు, “ఆరు నెలలపాటు రష్యాలో ఉందామని వెళ్లాను. అక్కడ చలికాలంలో తీవ్రమైన చలి ఉంటుంది కాబట్టి నేను తట్టుకోగలనో లేదో చూద్దామని నవంబరులో అక్కడికి వెళ్లాను.” హిరూ చలికాలమంతా అక్కడే ఉండి జపాన్‌కు తిరిగొచ్చాడు. తర్వాత తక్కువ ఖర్చులతో జీవిస్తూ, రష్యాకు వెళ్లడానికి కావాల్సిన డబ్బు దాచుకుని అక్కడికి వెళ్లిపోయాడు.

గత 12 ఏళ్లుగా రష్యాలో ఉంటున్న హిరూ వేర్వేరు సంఘాల్లో సేవచేశాడు. కొన్నిసార్లు, వందకు పైగా ప్రచారకులను ఆయన ఒక్కడే సంఘపెద్దగా చూసుకోవాల్సి వచ్చేది. ఓ సంఘంలోనైతే ఆయనే ప్రతీవారం సేవాకూటంలోని చాలా భాగాలు, పాఠశాల, కావలికోట, ఐదు వేర్వేరు సంఘ పుస్తక అధ్యయనాలు నిర్వహించేవాడు. చాలా కాపరి సందర్శనాలు కూడా చేసేవాడు. ఆ రోజుల్ని గుర్తుచేసుకుంటూ హిరూ ఇలా అంటున్నాడు, ‘సహోదరసహోదరీలు యెహోవాకు మరింత దగ్గరయ్యేలా సహాయం చేయడంలో చాలా సంతోషించేవాణ్ణి.’ అవసరం ఎక్కువున్న ప్రాంతంలో సేవ చేయడంవల్ల ఆయనెలా ప్రయోజనం పొందాడు? ఆయనిలా చెప్తున్నాడు, “రష్యాకు రాకముందు సంఘపెద్దగా, పయినీరుగా సేవ చేశాను. కానీ ఇక్కడికి వచ్చాకే, నాకు యెహోవాతో ఓ కొత్త సంబంధం ఏర్పడినట్లు అనిపిస్తుంది. జీవితంలో ప్రతీ విషయంలో యెహోవాపై మరింతగా నమ్మకం ఉంచడం నేర్చుకున్నాను.” హిరూ 2005లో **స్విట్లాన** అనే సహోదరిని పెళ్లిచేసుకున్నాడు. ఇప్పుడు వాళ్లిద్దరూ పయినీరు సేవలో కొనసాగుతున్నారు.

**కెనడా**కు చెందిన 34 ఏళ్ల **మాథ్యూ,** అతని తమ్ముడు 28 ఏళ్ల **మైఖేల్** ఒకసారి రష్యాకు వెళ్లారు. అక్కడ ఓ సంఘ కూటానికి వెళ్లినప్పుడు ఆసక్తిగలవాళ్లు చాలామంది రావడం, కానీ కూటాల్ని నిర్వహించే సహోదరులు కొద్దిమందే ఉండడం చూసి వాళ్లు ఆశ్చర్యపోయారు. మాథ్యూ ఇలా చెప్తున్నాడు, ‘ఆ రోజు కూటానికి 200 మంది వచ్చారు. కానీ కూటాలన్నిటినీ వయసుపైబడిన ఓ సంఘపెద్ద, ఓ యువ పరిచర్య సేవకుడే నిర్వహిస్తున్నారు. అది చూసిన తర్వాత, అక్కడికి వెళ్లి ఆ సహోదరులకు సహాయం చేయాలని నాకనిపించింది.’ ఆయన 2002లో రష్యాకు వెళ్లిపోయాడు.

నాలుగేళ్ల తర్వాత, మైఖేల్ కూడా రష్యాకు వెళ్లాడు. అక్కడ సహోదరుల అవసరం ఇంకా ఎక్కువగానే ఉందని ఆయన గమనించాడు. పరిచర్య సేవకునిగా ఆయన అకౌంట్స్, సాహిత్యం, క్షేత్రం వంటివి చూసుకోవాల్సి వచ్చేది. సంఘ కార్యదర్శి చేసే పనుల్ని కూడా ఆయనే చేయాల్సి వచ్చేది. అంతేకాక బహిరంగ ప్రసంగాలు ఇచ్చేవాడు, సమావేశ ఏర్పాట్లను, రాజ్యమందిర నిర్మాణ పనుల్ని కూడా చూసుకునేవాడు. నిజానికి, ఇప్పటికీ సంఘాల్లో సహోదరుల అవసరం చాలా ఉంది. అన్ని బాధ్యతల్ని చూసుకోవడం కష్టంగా అనిపించినా మైఖేల్ ఇలా అంటున్నాడు, ‘సహోదరులకు సహాయం చేయడం నాకు చాలా సంతృప్తినిస్తుంది. నా జీవితాన్ని ఇంతకన్నా బాగా ఉపయోగించలేను.’ ఆయన ప్రస్తుతం సంఘపెద్దగా సేవచేస్తున్నాడు.

మాథ్యూ **మారీన** అనే సహోదరిని, మైఖేల్ **ఓల్గ** అనే సహోదరిని పెళ్లిచేసుకున్నారు. ఈ దంపతులు, అలాగే చాలామంది స్వచ్ఛంద సేవకులు రష్యాలో వృద్ధి చెందుతున్న సంఘాలకు మద్దతిస్తున్నారు.

## కోతపనిలో ఉత్సాహంగా పాల్గొంటున్న సహోదరీలు

**యుక్రెయిన్**కు చెందిన **టాట్యాన** అనే సహోదరి విషయమే తీసుకోండి. ఆమెకు 16 ఏళ్లు ఉన్నప్పుడు చెక్ రిపబ్లిక్, పోలండ్, స్లోవాకియా దేశాలకు చెందిన ఆరుగురు ప్రత్యేక పయినీర్లు 1994లో ఆమె సంఘానికి వచ్చారు. వాళ్లను ఆప్యాయంగా గుర్తుచేసుకుంటూ ఆమె ఇలా చెప్తుంది, ‘ఆ పయినీర్లు ఎంతో ఉత్సాహంగా పరిచర్య చేస్తూ అందరితో కలిసిపోయేవాళ్లు, చాలా ప్రేమగా ఉండేవాళ్లు. వాళ్లకు బైబిల్లోని విషయాలు బాగా తెలుసు.’ వాళ్లు చేసిన త్యాగాలను యెహోవా ఎలా ఆశీర్వదించాడో చూశాక, ఆమె కూడా వాళ్లలా అవ్వాలనుకుంది.

ఆ పయినీర్లను చూసి ప్రోత్సాహం పొందిన టాట్యాన, స్కూల్‌కు సెలవులు ఇచ్చినప్పుడల్లా తోటి సాక్షులతో కలిసి యుక్రెయిన్, బెలారస్‌లో సువార్త చేరని మారుమూల ప్రాంతా

లకు వెళ్లి ప్రకటించేది. అది ఆమెకు ఎంత నచ్చిందంటే, మరింతగా పరిచర్య చేయడానికి రష్యాకు వెళ్లాలని నిర్ణయించుకుంది. అయితే ఆమె ముందుగా, వేరే దేశంనుండి వచ్చి రష్యాలో సేవచేస్తున్న ఓ సహోదరితోపాటు కొంతకాలం ఉండడానికి రష్యాకు వెళ్లింది. అంతేకాదు, తన ఖర్చులు కోసం ఓ చిన్న ఉద్యోగం కూడా వెతుక్కుంది. ఆ తర్వాత స్వదేశానికి తిరిగొచ్చి, 2000వ సంవత్సరంలో రష్యాకు వెళ్లిపోయింది. మరి ఆమెకు ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా?

టాట్యాన ఇలా చెప్తుంది, "నాకు ఓ ఇంటిని అద్దెకు తీసుకునే స్థోమత లేక వేరేవాళ్ల ఇంట్లో ఓ గదిని అద్దెకు తీసుకున్నాను. అయితే అలా ఉండడం కూడా కష్టంగానే అనిపించింది. తిరిగి వెళ్లిపోవాలని కొన్నిసార్లు అనిపించింది. కానీ తన సేవలో కొనసాగడం వల్ల వచ్చే ప్రయోజనాల్ని గుర్తించేందుకు యెహోవా నాకు ప్రతీసారి సహాయం చేశాడు." ప్రస్తుతం రష్యాలో మిషనరీగా సేవచేస్తున్న టాట్యాన ఇలా చెప్తుంది, 'మా దేశాన్ని వదిలి వచ్చి ఇన్ని సంవత్సరాలుగా ఇక్కడ సేవ చేయడంవల్ల మంచి అనుభవాలను, చాలామంది స్నేహితులను సంపాదించుకున్నాను. అన్నిటికన్నా ముఖ్యంగా నా విశ్వాసం బలపడింది.'

**జపాన్**కు చెందిన **మాసాకో** ప్రస్తుతం 50వ పడిలో ఉంది. మిషనరీ సేవ ఆమె చిరకాల కోరిక, కానీ అనారోగ్య సమస్యలవల్ల అది ఆమెకు అసాధ్యం అనిపించింది. కానీ ఆరోగ్యం కాస్త కుదుటపడగానే రష్యాకు వెళ్లి సేవ చేయాలని నిర్ణయించుకుంది. అక్కడికి వెళ్లాక మంచి ఇల్లు, ఉద్యోగం దొరకకపోయినా తన ఖర్చుల కోసం ఓ ఇంట్లో పనిచేస్తూ, ఇతరులకు జపనీస్ భాష నేర్పిస్తూ పయినీరు సేవ చేసింది. ఆ సేవలో కొనసాగడానికి ఆమెకేమి సహాయం చేసింది?

రష్యాలో 14 ఏళ్లుగా చేస్తున్న సేవను గుర్తుచేసుకుంటూ మాసాకో ఇలా చెప్తుంది, 'పరిచర్యలో ఉన్న ఆనందంవల్ల, నాకు ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా తట్టుకోగలుగుతున్నాను. అవసరం ఎక్కువున్న ప్రాంతాల్లో సేవ చేయడంవల్ల జీవితం మరింత ఉత్సాహంగా, ఉత్తేజంగా అనిపిస్తుంది. ఇన్నేళ్లుగా యెహోవా నాకు కావాల్సిన ఆహారాన్ని, వస్త్రాల్ని, వసతిని ఎలా ఇస్తున్నాడో చూస్తుంటే ఓ అద్భుతంలా అనిపిస్తుంది.' ఆమె రష్యాతోపాటు కిర్గిజ్‌స్థాన్‌లో కూడా సేవ చేసింది. అంతేకాక ఇంగ్లీష్, చైనీస్, వీగుర్ భాషా గుంపులకు కూడా సహాయం చేసింది. ప్రస్తుతం ఆమె సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో పయినీరుగా సేవ చేస్తోంది.

**1** మైఖేల్, ఓల్గ, మారీన, మాథ్యూ

**2** టాట్యాన

**3** మాసాకో

**4** ఇంగ, మికాయిల్








ఒక్సానా, అలిక్సేయ్‌, యూర్రీ

## ప్రకటనా పనికి మద్దతిస్తూ ఆశీర్వాదాలు పొందుతున్న కుటుంబాలు

ఆర్థిక ఒత్తిళ్ల వల్ల, చాలా కుటుంబాలు డబ్బు సంపాదించడానికి విదేశాలకు వెళ్తున్నాయి. కానీ, కొన్ని కుటుంబాలు ప్రాచీన కాలంలోని అబ్రాహాము శారాల్లాగే ఆధ్యాత్మిక లక్ష్యాల కోసం విదేశాలకు వెళ్తున్నాయి. (ఆది. 12:1-9) **యుక్రెయిన్‌**కు చెందిన **మికాయెల్‌, ఇంగ** అనే జంట 2003లో రష్యాకు వెళ్లారు. వాళ్లు సత్యం కోసం వెదుకుతున్న చాలామందిని అక్కడ కలుసుకున్నారు.

మికాయెల్‌ ఇలా చెప్తున్నాడు, "సాక్షులు ఇంతవరకూ ప్రకటించని ప్రాంతంలో ఓసారి మేము ప్రకటిస్తున్నప్పుడు, ఓ వృద్ధుడు తలుపు తీసి 'మీరు సువార్తికులా?' అని అడిగాడు. మేము అవునని చెప్పగానే, 'ఏదో ఒక రోజు మీరు వస్తారని నాకు తెలుసు. యేసు చెప్పిన మాటలు నెరవేరకుండా పోవు' అంటూ మత్తయి 24:14లోని మాటల్ని చెప్పాడు. ఆ తర్వాత మేము, బాప్టిస్ట్‌ చర్చికి వెళ్లే పదిమంది స్త్రీలను కూడా ఆ ప్రాంతంలో కలిశాం. వాళ్లు సత్యం కోసం పరితపిస్తున్నారు. వాళ్లు తమ దగ్గరున్న 'పరదైసు' పుస్తకం సహాయంతో ప్రతీవారం బైబిలు అధ్యయనం చేసుకుంటున్నారు. వాళ్ల ప్రశ్నలకు జవాబిస్తూ మేము చాలా గంటలు గడిపాం, వాళ్లతో కలిసి రాజ్యగీతాలు పాడాం, కలిసి భోజనం చేశాం. నాకున్న మధుర జ్ఞాపకాల్లో అదొకటి." అవసరం ఎక్కువున్న ప్రాంతాల్లో సేవ చేయడంవల్ల యెహోవాకు దగ్గరయ్యామని, ప్రజలమీద ప్రేమ ఇంకా పెరిగిందని, మరింత సంతోషంగా సంతృప్తిగా ఉన్నామని మికాయెల్‌, ఇంగ చెప్తున్నారు. ప్రస్తుతం వాళ్లు ప్రాంతీయ సేవ చేస్తున్నారు.

**యుక్రెయిన్‌**కు చెందిన **యూర్రీ, ఒక్సానా** ప్రస్తుతం 30వ పడిలో ఉన్నారు, వాళ్ల అబ్బాయి **అలిక్సేయ్‌**కు ప్రస్తుతం 13 ఏళ్లు. వాళ్లు 2007లో రష్యా బ్రాంచిని చూడ్డానికి వెళ్లినప్పుడు, రష్యాలో సువార్త చేరని చాలా ప్రాంతాలను ఓ మ్యాప్‌లో చూశారు. ఒక్సానా ఇలా చెప్తుంది, "ఆ మ్యాప్‌ చూశాక, అక్కడ రాజ్యప్రచారకుల అవసరం ఎంత ఉందో మాకు అర్థమైంది. దాంతో రష్యాకు వెళ్లాలని నిర్ణయించుకున్నాం." అలా వెళ్లడానికి వాళ్లింకా ఏమి చేశారు? యూర్రీ ఇలా చెప్తున్నాడు, "'మీరు విదేశీక్షేత్రంలో సేవ చేయగలరా?' వంటి ఆర్టికల్స్‌ను మన ప్రచురణల్లో చదవడం మాకెంతో ఉపయోగపడింది.* రష్యా బ్రాంచి మాకు చెప్పిన ప్రాంతానికి వెళ్లి, అక్కడ ఓ ఇంటి కోసం, ఉద్యోగం కోసం వెదికాం." వాళ్లు 2008లో రష్యాకు వెళ్లారు.

మొదట్లో వాళ్లకు ఉద్యోగం దొరకడం కష్టమైంది, చాలా సార్లు ఇల్లు మారాల్సి వచ్చింది కూడా. యూర్రీ ఇలా చెప్తున్నాడు, "మేము నిరుత్సాహపడకుండా ఉండడానికి తరచూ ప్రార్థించేవాళ్లం. యెహోవా సహాయం చేస్తాడన్న నమ్మకంతో మా సేవను కొనసాగించాం. రాజ్యానికి మొదటి స్థానమిచ్చినప్పుడు యెహోవా మన అవసరాల్ని ఎలా తీరుస్తాడో మేము చూశాం. ఆ సేవ మా కుటుంబాన్ని ఆధ్యాత్మికంగా బలపర్చింది." (మత్త. 6:22, 33) మరి అలిక్సేయ్‌ ఎలా ప్రయోజనం పొందాడు? ఒక్సానా ఇలా చెప్తుంది, 'మా అబ్బాయి ఎంతో ప్రయోజనం పొందాడు. తను తొమ్మిది ఏళ్లకే యెహోవాకు సమర్పించుకుని బాప్తిస్మం పొందాడు. రాజ్యప్రచారకుల అవసరం ఎంత ఉందో చూస్తున్నాడు కాబట్టి, అతను స్కూల్‌కు సెలవులు ఇచ్చినప్పుడల్లా సహాయ పయినీరు సేవ చేస్తున్నాడు. పరిచర్యపట్ల తనకున్న ప్రేమ, ఉత్సాహం చూస్తుంటే మాకు చాలా సంతోషంగా ఉంది.' ప్రస్తుతం యూర్రీ, ఒక్సానా ప్రత్యేక పయినీర్లుగా సేవచేస్తున్నారు.

## 'నాకున్న ఒకే ఒక బాధ'

వాళ్ల అనుభవాలు విన్నాక, మరింత ఎక్కువ సేవ చేయడం కోసం వేరే ప్రాంతాలకు వెళ్లాలంటే, యెహోవాపై పూర్తి నమ్మకముంచాలని మీకు అర్థమయ్యే ఉంటుంది. నిజమే, అలా వెళ్లే వాళ్లకు కొన్ని ఇబ్బందులు ఎదురౌతాయి. కానీ సువార్తను చక్కగా వినే ప్రజలకు ప్రకటించడంలో ఉన్న గొప్ప ఆనందాన్ని వాళ్లు అనుభవిస్తారు. కాబట్టి అవసరం ఎక్కువున్న ప్రాంతాలకు వెళ్లి మీరు సేవచేయగలరా? అలా వెళ్లాలని నిర్ణయించుకుంటే, మీరు కూడా యూర్రీలాగే భావించవచ్చు. అవసరం ఎక్కువున్న ప్రాంతాల్లో సేవచేయాలన్న తన నిర్ణయం గురించి ఆయనిలా అన్నాడు, "నాకున్న ఒకే ఒక బాధ ఏంటంటే, నేను ఈ నిర్ణయాన్ని ముందే ఎందుకు తీసుకోలేదా అని."

* కావలికోట అక్టోబరు 15, 1999 సంచిక 23-27 పేజీలు చూడండి.




# ఆధ్యాత్మిక పరదైసును అందంగా తీర్చిదిద్దండి

*"నేను నా పాదస్థలమును మహిమపరచెదను."*—యెష. 60:13.

**పాటలు: 28, 53**

## మీరు వివరించగలరా?

యెహోవా సత్యారాధకులందరు ఏమి చేయాలని కోరుకుంటారు?

అపొస్తలుడైన పౌలు దర్శనంలో చూసిన "పరదైసు" ఏమిటి?

ఆధ్యాత్మిక పరదైసును మనమెలా అందంగా తీర్చిదిద్దవచ్చు?

'ఆకాశము నా సింహాసనము భూమి నా పాదపీఠం' అని యెహోవా చెప్పాడు. (యెష. 66:1) "నేను నా పాదస్థలమును మహిమపరచెదను" అని కూడా ఆయన అన్నాడు. (యెష. 60:13) యెహోవా తన పాదపీఠమైన భూమిని ఎలా మహిమపరుస్తాడు? దానివల్ల భూమ్మీద జీవిస్తున్న మనం ఎలా ప్రయోజనం పొందుతాం?

2 హీబ్రూ లేఖనాల్లో 'పాదపీఠం' అనే పదం, ప్రాచీన ఇశ్రాయేలులోని దేవాలయాన్ని కూడా సూచిస్తుంది. (1 దిన. 28:2; కీర్త. 132:7) ఆ ఆలయంలో ప్రజలు యెహోవాను ఆరాధించేవాళ్లు, కాబట్టి అది ఆయన దృష్టిలో ఎంతో అందమైనది. అంతేకాదు, ఆ దేవాలయం యెహోవా పాదపీఠమైన భూమికి మహిమ తీసుకొచ్చింది.

3 అయితే మనకాలంలో, భూమ్మీదున్న ఏ ఆలయం కాదుగానీ ఓ ఆధ్యాత్మిక ఆలయం సత్యారాధనకు కేంద్రంగా ఉంది. ఆ ఆలయం కంటికి కనిపించే కట్టడం కాదు. అది మరే ఇతర ఆలయంకన్నా ఎక్కువగా యెహోవాను మహిమపరుస్తుంది. యేసుక్రీస్తు బలి ఆధారంగా, మనుషులు తనకు స్నేహితులయ్యేందుకు, తనను ఆరాధించేందుకు

**1, 2.** 'పాదపీఠం' అనే పదం వేటిని సూచిస్తుంది?
**3.** నేడు ఏ ఆలయంలో దేవుని సేవకులు యెహోవాను ఆరాధిస్తున్నారు? అది ఎప్పుడు ఉనికిలోకి వచ్చింది?

యెహోవా చేసిన ఏర్పాటే ఆ ఆధ్యాత్మిక ఆలయం. యేసు సా.శ. 29లో బాప్తిస్మం తీసుకుని దేవుని ఆధ్యాత్మిక ఆలయానికి ప్రధాన యాజకునిగా అభిషేకించబడినప్పుడు అది ఉనికిలోకి వచ్చింది.—హెబ్రీ. 9:11, 12.

4 సత్యారాధన కోసం యెహోవా చేసిన ఆ ఏర్పాటుకు మనం ఎంతో కృతజ్ఞులం. ఆయన నామం గురించి, విమోచన క్రయధనం అనే అద్భుతమైన బహుమానం గురించి ఇతరులకు చెప్పడం ద్వారా మనం యెహోవాను స్తుతిస్తాం. నేడు 80 లక్షలకన్నా ఎక్కువమంది సత్యారాధకులు యెహోవాను స్తుతిస్తున్నారని తెలుసుకోవడం మనకెంతో సంతోషాన్నిస్తుంది. వేరే మతాలకు చెందిన చాలామంది, తాము చనిపోయాక పరలోకానికి వెళ్తామని అక్కడ దేవున్ని స్తుతిస్తామని అనుకుంటారు. అయితే **ఇక్కడే, ఇప్పుడే** యెహోవాను స్తుతించడం చాలా ముఖ్యమని యెహోవా ప్రజలమైన మనకు తెలుసు.

5 మనం యెహోవాను స్తుతించినప్పుడు, **కీర్తన 99:1-3, 5-7** వచనాల్లో ఉన్న దేవుని సేవకులను అనుకరిస్తాం. (**చదవండి.**) మోషే, అహరోను, సమూయేలు వంటి నమ్మకమైన సేవకులు అప్పట్లో సత్యారాధన కోసం దేవుడు చేసిన ఏర్పాటుకు పూర్తిగా మద్దతిచ్చారు. అభిషిక్తులు పరలోకంలో యేసుతోపాటు యాజకులుగా సేవ చేసే ముందు, ఆధ్యాత్మిక ఆలయంలోని భూభాగంలో యెహోవాకు నమ్మకంగా సేవ చేస్తారు. వాళ్లకు లక్షలమంది 'వేరే గొర్రెలు' నమ్మకంగా మద్దతిస్తారు. (యోహా. 10:16) ఈ రెండు గుంపుల వాళ్లు యెహోవా 'పాదపీఠమైన' భూమిపై ఆయన్ను ఐక్యంగా ఆరాధిస్తున్నారు. మరి మన విషయమేమిటి? 'సత్యారాధన కోసం యెహోవా చేసిన ఏర్పాటుకు నేను పూర్తిగా మద్దతిస్తున్నానా?' అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి.

**4, 5.** (ఎ) సత్యారాధకులు ఏమి చేయాలని కోరుకుంటారని 99వ కీర్తన చెప్తుంది? (బి) మనం ఏమని ప్రశ్నించుకోవాలి?

## ఆధ్యాత్మిక ఆలయంలో సేవించేవాళ్లను యెహోవా గుర్తించాడు

6 క్రైస్తవ సంఘం స్థాపించి 100 ఏళ్లు అవ్వకముందే మతభ్రష్టత్వం మొదలైంది. దాని గురించి బైబిలు ముందే చెప్పింది. (అపొ. 20:28-30; 2 థెస్స. 2:3, 4) కాలం గడిచేకొద్దీ, దేవుని నిజమైన ఆరాధకులు ఎవరో గుర్తుపట్టడం మరింత కష్టమైంది. అయితే వందల సంవత్సరాల తర్వాత యెహోవా యేసును ఉపయోగించుకుని, ఆధ్యాత్మిక ఆలయంలో తనను నిజంగా సేవిస్తున్నవాళ్లను గుర్తించాడు.

7 దేవుని ఆమోదం ఎవరికి ఉందో, ఆయన ఆధ్యాత్మిక ఆలయంలో ఎవరు సేవిస్తున్నారో 1919 కల్లా స్పష్టమైంది. వాళ్లు తమ ఆరాధనా పద్ధతుల్లో ఎన్నో మార్పులు చేసుకుని యెహోవాకు ఇష్టమైన విధంగా ఆరాధించడం మొదలుపెట్టారు. (యెష. 4:2, 3; మలా. 3:1-4) అలా, కొన్ని వందల సంవత్సరాల క్రితం అపొస్తలుడైన పౌలు చూసిన ఓ దర్శనం నెరవేరడం ప్రారంభమైంది.

8 పౌలు చూసిన దర్శనం గురించి **2 కొరింథీయులు 12:1-4** వచనాల్లో ఉంది. (**చదవండి.**) భవిష్యత్తులో ఉండే ఓ పరిస్థితిని యెహోవా పౌలుకు ఆ దర్శనంలో చూపించాడు. ఆయన చూసిన "పరదైసు" దేన్ని సూచిస్తుంది? మొదటిగా, అది త్వరలో రానున్న భూపరదైసును సూచించవచ్చు. (లూకా 23:43) రెండవదిగా, కొత్తలోకంలో ప్రజలు అనుభవించే పరిపూర్ణ ఆధ్యాత్మిక పరదైసును సూచించవచ్చు. మూడవదిగా, 'దేవుని పరదైసును' అంటే పరలోకంలో ఉండే అద్భుతమైన పరిస్థితుల్ని సూచించవచ్చు.—ప్రక. 2:7.

9 మరి ఆ దర్శనంలో వచింపశక్యం కాని

**6, 7.** బైబిలు ముందే చెప్పినట్లు తొలి క్రైస్తవ సంఘానికి ఏమైంది? వందల సంవత్సరాల తర్వాత యెహోవా ఏమి చేశాడు?

**8, 9.** పౌలు దర్శనంలో చూసిన "పరదైసు" దేన్ని సూచిస్తుంది?

మాటలు విన్నాననీ, వాటిని ఎవరూ పలకకూడదనీ పౌలు ఎందుకు అన్నాడు? ఎందుకంటే, దర్శనంలో చూసిన అద్భుతమైన విషయాల్ని పూర్తిగా వివరించడానికి యెహోవా పౌలుకు అప్పుడు అనుమతివ్వలేదు. అయితే యెహోవా ఇప్పుడు మనల్ని అనుమతిస్తున్నాడు కాబట్టి, మనం అనుభవిస్తున్న ఆశీర్వాదాల గురించి ఇతరులకు చెప్పవచ్చు.

10 ఆధ్యాత్మిక పరదైసు అనే మాట మన ప్రచురణల్లో చాలాసార్లు వస్తుంటుంది. ఇంతకీ ఆధ్యాత్మిక పరదైసు అంటే ఏమిటి? ఆధ్యాత్మిక పరదైసు, ఆధ్యాత్మిక ఆలయం ఒకటేనా? కాదు. ఆధ్యాత్మిక పరదైసు అంటే యెహోవా ప్రజలు మాత్రమే అనుభవించే సమాధానకరమైన పరిస్థితి. కానీ ఆధ్యాత్మిక ఆలయం అంటే సత్యారాధన కోసం యెహోవా దేవుడు చేసిన ఏర్పాటు. యెహోవా ప్రజల మధ్యవున్న సమాధానాన్ని బట్టి, వాళ్లు మాత్రమే దేవుని ఆధ్యాత్మిక ఆలయంలో ఆయన్ను సేవిస్తున్నారని చెప్పవచ్చు.—మలా. 3:18.

11 ఆధ్యాత్మిక పరదైసును సాగుచేసి, దాన్ని వృద్ధి చేస్తూ విస్తరింపజేసే గొప్ప అవకాశాన్ని యెహోవా 1919 నుండి అపరిపూర్ణ మనుషులకు ఇస్తున్నాడు. ఆ అద్భుతమైన పనిలో మీరూ పాల్గొంటున్నారా? యెహోవా 'పాదపీఠాన్ని' మహిమపర్చడంలో ఆయనతో కలిసి పనిచేసే అవకాశాన్ని మీరు అమూల్యంగా ఎంచుతున్నారా?

## యెహోవా తన సంస్థను మరింత అందంగా తీర్చిదిద్దుతున్నాడు

12 దేవుని సంస్థలోని భూమ్మీద భాగంలో ఎన్నో అద్భుతమైన మార్పులు జరుగుతాయని యెషయా ప్రవచించాడు. (**యెషయా 60:17 చదవండి.**) మన మధ్యవున్న యౌవనులు లేదా కొత్తగా సత్యంలోకి వచ్చినవాళ్లు ఆ మార్పుల గురించి కేవలం **చదివుంటారు** లేదా **వినుంటారు**. కానీ చాలామంది సహోదరసహోదరీలు వాటిని **కళ్లారా చూశారు**. అందుకే, మన రాజైన యేసుక్రీస్తు ద్వారా యెహోవా తన సంస్థను నడిపిస్తున్నాడని వాళ్లకు నమ్మకం కుదిరింది. వాళ్ల అనుభవాలు విన్నప్పుడు యెహోవాపై మన విశ్వాసం, నమ్మకం బలపడతాయి.

13 నిజక్రైస్తవులందరూ యెహోవా సంస్థ గురించి ఇతరులకు చెప్పాలి. సాతాను లోకంలో జీవిస్తున్నప్పటికీ, యెహోవా ప్రజలందరూ సమాధానంగా, ఐక్యంగా ఉండడం ఎంత అద్భుతమైన విషయం! "సీయోను" గురించి అంటే యెహోవా సంస్థ గురించి అద్భుతమైన విషయాల్ని, మనం అనుభవిస్తున్న ఆధ్యాత్మిక పరదైసు గురించిన సత్యాన్ని 'రాబోయే తరాలకు' చెప్పడం ఎంతో సంతోషాన్నిస్తుంది.—**కీర్తన 48: 12-14 చదవండి.**

14 మన మధ్యవున్న వృద్ధ సహోదరసహోదరీలు దేవుని సంస్థలో వచ్చిన ఎన్నో మార్పుల్ని స్వయంగా చూశారు. అవి దేవుని సంస్థలోని భూమ్మీద భాగాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాయి. ఉదాహరణకు, సంఘాల్లో ఒకప్పుడు పెద్దల సభకు బదులు సంఘ సేవకుడు ఉండేవాడు. సంఘానికి సంబంధించిన ఏ నిర్ణయమైనా ఆయన ఒక్కడే తీసుకునేవాడు. అలాగే బ్రాంచి కమిటీకి బదులు బ్రాంచి సేవకుడు, యెహోవా సాక్షుల పరిపాలక సభకు బదులు వాచ్ టవర్ సొసైటీ అధ్యక్షుడు ఉండేవాళ్లు. వీళ్లకు సహాయకులుగా కొంతమంది నమ్మకమైన సహోదరులు ఉన్నప్పటికీ, నిర్ణయాలన్నిటినీ ఒక్కరే తీసుకునేవాళ్లు. అయితే 1970 తర్వాత ఈ పద్ధతిలో మార్పు వచ్చింది, నిర్ణయాల్ని ఒకేవ్యక్తి తీసు

**10.** "ఆధ్యాత్మిక పరదైసు," "ఆధ్యాత్మిక ఆలయం" ఒకటేనా? వివరించండి.

**11.** నేడు మనకు ఏ గొప్ప అవకాశం ఉంది?

**12.** యెషయా 60:17 నెరవేరిందని మనమెలా చెప్పవచ్చు? (ప్రారంభ చిత్రం చూడండి.)

**13.** కీర్తన 48:12-14 వచనాల ప్రకారం మనమేమి చేయాలి?

**14, 15.** దేవుని సంస్థలో 1970 తర్వాత ఎలాంటి మార్పులు వచ్చాయి? అవి ఎందుకు ప్రయోజనకరం?




ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలకు అవసరమైన మార్గనిర్దేశాన్ని యెహోవా ఇస్తున్నాడు
(16, 17 పేరాలు చూడండి)

కునే బదులు కొంతమంది పెద్దల గుంపు తీసుకోవడం మొదలైంది.

15 మరి ఇలాంటి మార్పుల వల్ల సంస్థకు ప్రయోజనం కలిగిందా? ఖచ్చితంగా. ఎందుకంటే, లేఖనాలను మరింత బాగా అర్థం చేసుకున్న తర్వాతే ఆ మార్పుల్ని చేశారు. నిర్ణయాలన్నీ ఒక్కరే తీసుకునే బదులు, యెహోవా దేవుడు అనుగ్రహించిన 'ఈవులు' లేదా **పెద్దలందరూ** కలిసి తీసుకోవడం వల్ల వాళ్లకున్న మంచి లక్షణాలనుండి సంస్థ ప్రయోజనం పొందుతుంది.—ఎఫె. 4:8; సామె. 24:6.

16 ఈ మధ్యకాలంలో మన ప్రచురణల రూపురేఖల్లో, సమాచారంలో, వాటిని పంచిపెట్టే విధానంలో వచ్చిన మార్పుల గురించి కూడా ఒకసారి ఆలోచించండి. మన ప్రచురణలు అందరికీ ఉపయోగపడే సమాచారంతో ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా ఉంటున్నాయి కాబట్టి వాటిని ఎంతో సంతోషంగా అందిస్తున్నాం. అంతేకాదు, సువార్త ప్రకటించడానికి ఆధునిక టెక్నాలజీని ఏయే విధాల్లో ఉపయోగిస్తున్నామో కూడా ఆలోచించండి. దానికో ఉదాహరణ, మన jw.org వెబ్‌సైట్. సరైన నిర్దేశం కోసం ఎదురుచూస్తున్న చాలామంది ప్రజలు దీని నుండి ప్రయోజనం పొందుతున్నారు. ఈ మార్పులన్నిటినీ చూస్తే ప్రజలమీద యెహోవాకు ఎంత శ్రద్ధ, ప్రేమ ఉన్నాయో అర్థమౌతుంది.

17 మన సంస్థ ఎంతో ఆలోచించి కూటాల విషయంలో మార్పులు చేసినందుకు కూడా మనమెంతో సంతోషిస్తున్నాం. వాటివల్ల కుటుంబ ఆరాధనకు లేదా వ్యక్తిగత అధ్యయనానికి ఇప్పుడు మనకు మరింత సమయం ఉంటుంది. అంతేకాదు అసెంబ్లీలు, సమావేశ కార్యక్రమాల్లో కూడా మార్పులు వచ్చాయి, సంవత్సరాలు గడిచేకొద్దీ అవి మరింత ప్రయోజనకరంగా ఉంటున్నాయి. అనేక బైబిలు పాఠశాలల ద్వారా యెహోవా మనకు శిక్షణ ఇస్తున్నందుకు ఎంతో కృతజ్ఞులం. ఈ మార్పులన్నీ చూస్తుంటే, యెహోవా దేవుడే

---

**16, 17.** ఈ మధ్యకాలంలో సంస్థ చేసిన మార్పుల్లో మీకేది బాగా నచ్చింది? ఎందుకు?



ఆధ్యాత్మిక పరదైసును విస్తరింపజేయడంలో
మీరూ సహాయం చేయవచ్చు
(18, 19 పేరాలు చూడండి)

తన సంస్థను నడిపిస్తూ ఆధ్యాత్మిక పరదైసును మరింత అందంగా తీర్చిదిద్దుతున్నాడని అర్థమౌతుంది.

## ఆధ్యాత్మిక పరదైసును అందంగా తీర్చిదిద్దడంలో మన పాత్ర

18 ఆధ్యాత్మిక పరదైసును మరింత అందంగా తీర్చిదిద్దే పనిలో సహాయం చేయడం మనకు దొరికిన గొప్ప గౌరవం. కాబట్టి మనం రాజ్యసువార్తను ఉత్సాహంగా ప్రకటిస్తూ, ఎక్కువమందిని శిష్యులుగా చేయాలి. అలా, ఒకవ్యక్తి దేవుని సేవకుడయ్యేందుకు సహాయం చేసిన ప్రతీసారి మనం ఆధ్యాత్మిక పరదైసును విస్తరింపజేయడంలో చేయి కలిపినట్టే.—యెష. 26:15; 54:2.

19 అంతేకాదు, మన క్రైస్తవ లక్షణాలను మెరుగుపర్చుకోవడం ద్వారా కూడా మనం ఆధ్యాత్మిక పరదైసును మరింత అందంగా తీర్చిదిద్దుతాం. దానివల్ల ఇతరులు ఆధ్యాత్మిక పరదైసుకు మరింత ఆకర్షితులౌతారు. సాధారణంగా ప్రజల్ని మొదట ఆకర్షించేది మన బైబిలు జ్ఞానం కాదుగానీ మన మంచి ప్రవర్తనే. దాన్నిబట్టే వాళ్లు మన సంస్థకు ఆ తర్వాత యెహోవాకు, యేసుక్రీస్తుకు దగ్గరౌతారు.

20 మన మధ్యవున్న అందమైన ఆధ్యాత్మిక పరదైసును చూసి యెహోవా దేవుడు, యేసుక్రీస్తు ఎంతో సంతోషిస్తుంటారు. ఆధ్యాత్మిక పరదైసును అందంగా తీర్చిదిద్దుతూ మనం ఇప్పుడు ఎంతో ఆనందిస్తున్నాం. అయితే ఈ ఆనందం, భూమి అంతటినీ నిజమైన పరదైసుగా మారుస్తున్నప్పుడు మనం పొందే అసలైన ఆనందానికి ఓ శాంపిల్ మాత్రమే. సామెతలు 14:35లో ఉన్న ఈ మాటల్ని మనం ఎప్పుడూ గుర్తుంచుకుందాం, "బుద్ధిగల సేవకుడు రాజులకిష్టుడు." కాబట్టి, ఆధ్యాత్మిక పరదైసును అందంగా తీర్చిదిద్దుతూ మనం జ్ఞానంతో నడుచుకుందాం.

**18, 19.** ఆధ్యాత్మిక పరదైసును మరింత అందంగా తీర్చిదిద్దడంలో మనమెలా సహాయపడవచ్చు?

**20.** సామెతలు 14:35 ప్రకారం మనమేమి చేయాలి?

# ‘దుర్దినాల్లో’ సంతోషంగా యెహోవాను సేవించండి

“నా అనారోగ్య సమస్యలు రోజురోజుకీ ఎక్కువౌతున్నాయి” అని 70లలో ఉన్న ఎర్నెస్ట్* అనే సహోదరుడు బాధపడుతున్నాడు. మీకూ అలానే అనిపిస్తుందా? వయసుపైబడడం వల్ల మీ ఆరోగ్యం, బలం రోజురోజుకీ క్షీణిస్తుండవచ్చు. ఆ పరిస్థితుల్లో, ప్రసంగి 12వ అధ్యాయంలోని మాటల్ని మీరు బాగా అర్థం చేసుకోగలుగుతారు. ఉదాహరణకు 1వ వచనంలో, ముసలితనంలో ‘దుర్దినాలు’ అంటే కష్టాలతో నిండిన రోజులు ఉంటాయని బైబిలు చెప్తుంది. అయితే వయసుపైబడినంత మాత్రాన కృంగిపోవాల్సిన అవసరం లేదు. మీరు ఈ వయసులో కూడా సంతోషంగా యెహోవా సేవ చేస్తూ సంతృప్తిగా జీవించవచ్చు.

## విశ్వాసాన్ని బలంగా ఉంచుకోండి

ప్రియమైన వృద్ధ సహోదరసహోదరీల్లారా, మీలాగే బైబిలు కాలాల్లోని యెహోవా సేవకులు కూడా వృద్ధాప్యంలో కష్టాలు పడ్డారు. ఉదాహరణకు ఇస్సాకు, యాకోబు, అహీయాల చూపు మందగించింది. (ఆది. 27:1; 48:10; 1 రాజు. 14:4) శారా, తన ‘బలం ఉడిగిపోయినట్లు’ భావించింది. (ఆది. 18:11, 12) ముసలితనంలో దావీదు చలిని తట్టుకోలేకపోయాడు. (1 రాజు. 1:1) ధనవంతుడైన బర్జిల్లయి ఆహారాన్ని, సంగీతాన్ని ఆస్వాదించలేకపోయాడు. (2 సమూ. 19:32-35) అబ్రాహాము భార్యను పోగొట్టుకుని ఎంతో బాధపడ్డాడు. నయోమికి కూడా అలాంటి కష్టమే వచ్చింది.—ఆది. 23:1, 2; రూతు 1:3, 12.

ఆ పరిస్థితుల్లో కూడా వాళ్లందరూ యెహోవాకు నమ్మకంగా ఉంటూ సంతోషాన్ని ఎలా కాపాడుకోగలిగారు? అబ్రాహాము వయసుపైబడినా దేవుని వాగ్దానాల మీద నమ్మకముంచుతూ ‘విశ్వాసంవల్ల బలం పొందాడు.’ (రోమా. 4:19-21) మనకు కూడా అలాంటి బలమైన విశ్వాసమే ఉండాలి. అది మన వయసుపై, సామర్థ్యంపై లేదా పరిస్థితులపై ఆధారపడివుండదు. ఉదాహరణకు యాకోబు, మంచం మీదనుండి లేవలేనంత బలహీనంగా ఉన్నా, చూపు తగ్గినా దేవుని వాగ్దానాల మీద బలమైన విశ్వాసం ఉంచాడు. (ఆది. 48:1-4, 10; హెబ్రీ. 11:21) మన కాలానికి వస్తే, కండరాల బలహీనతతో బాధపడుతున్న 93 ఏళ్ల ఈనెస్ ఇలా చెప్తోంది, “ప్రతీరోజు యెహోవా నాకు ఎన్నో దీవెనలు ఇస్తున్నట్లు భావిస్తాను. నేను రోజూ పరదైసు గురించి ఆలోచిస్తాను, అది నాలో భవిష్యత్తు మీద ఆశను పెంచుతుంది.” అది ఎంత చక్కని స్ఫూర్తి!

మన విశ్వాసాన్ని బలపర్చుకోవాలంటే ప్రార్థించాలి, బైబిలు చదవాలి, కూటాలకు హాజరవ్వాలి. దానియేలు వయసుపైబడినా రోజూ మూడుసార్లు ప్రార్థించేవాడు, దేవుని వాక్యాన్ని అధ్యయనం చేసేవాడు. (దాని. 6:10; 9:2) విధవరాలైన అన్న ముసలితనంలో కూడా ‘దేవాలయానికి విడువక’ వెళ్లేది. (లూకా 2:36, 37) వృద్ధులైన మీరు కూడా సాధ్యమైనప్పుడల్లా కూటాలకు వెళ్తూ, వాటిలో ఎక్కువగా పాల్గొంటూ ఉండండి. అలా చేస్తే, మీరూ అలాగే హాజరైనవాళ్లంతా ప్రోత్సాహం పొందుతారు. యెహోవా సేవలో మీరు చేస్తున్నది కొంచెమే అయినా, ఆయన ఎల్లప్పుడూ మీ ప్రార్థనలను సంతోషంగా వింటాడు.—సామె. 15:8.

మీలో చాలామంది చక్కగా చూడాలనీ చదవాలనీ కూటాలకు హాజరయ్యేంత బలంగా ఉండాలని కోరుకుంటుండవచ్చు. కానీ వయసు పెరిగేకొద్దీ అది కష్టమని, దాదాపు అసాధ్యమని కూడా మీకు అనిపించవచ్చు. అప్పుడు మీరేమి చేయవచ్చు? మీకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను చక్కగా ఉపయోగించుకోండి. మీటింగ్స్‌కి హాజరుకాలేని చాలామంది ఫోన్ ద్వారా వాటిని వింటారు. 79 ఏళ్ల ఇంగ అనే సహోదరి, తనకు కంటిచూపు సరిగ్గా లేకపోయినా, సంఘంలోని ఓ సహోదరుడిచ్చే పెద్ద అచ్చు ప్రింట్‌లను ఉపయోగించి కూటాలకు సిద్ధపడుతుంది.

వేరేవాళ్లకు లేనంత తీరిక సమయం మీకుండవచ్చు. ఆ సమయంలో బైబిలు అలాగే ఇతర ప్రచురణల రికార్డింగ్‌లను, ప్రసంగాల్ని, ఆడియో డ్రామాల్ని వినవచ్చు. అంతేకాదు తోటి సహోదరులకు ఫోన్‌చేసి, బైబిలు విషయాల గురించి మాట్లాడి, ఒకర్నొకరు ప్రోత్సహించుకోవచ్చు.—రోమా. 1:11, 12.

## దేవుని సేవలో చురుగ్గా ఉండండి

‘ఒకప్పటిలా ఉత్సాహంగా పరిచర్య చేయలేకపోతున్నందుకు చాలా బాధగా ఉంది’ అని 80లలో ఉన్న క్రిస్టా అనే సహోదరి చెప్తోంది. అయితే వయసు పైబడుతున్నా సంతోషాన్ని ఎలా

* అసలు పేర్లు కావు.



ఒకర్నొకరు ప్రోత్సహించుకోండి



ప్రకటించండి



ఆతిథ్యం ఇవ్వండి

కాపాడుకోవచ్చు? 75 ఏళ్ల పీటర్ ఇలా చెప్తున్నాడు, 'సానుకూల దృక్పథంతో ఉండాలి, అంటే మీరు చేయలేకపోతున్న వాటి గురించి ఆలోచిస్తూ ఉండడంకన్నా, చేయగలిగిన వాటినిబట్టి సంతోషించాలి.'

సాక్ష్యమివ్వడానికి మీకు ఏయే అవకాశాలు ఉన్నాయో ఆలోచించండి. హైడీ అనే సహోదరి ఒకప్పటిలా ఇంటింటి పరిచర్యకు వెళ్లలేకపోతుంది. కాబట్టి ఉత్తరాల ద్వారా సాక్ష్యమివ్వడం కోసం 80 ఏళ్ల వయసులో కంప్యూటర్ ఉపయోగించడం నేర్చుకుంది. కొంతమంది వృద్ధ ప్రచారకులు, పార్కుల్లో లేదా బస్‌స్టాపుల్లో కూర్చున్నప్పుడు ఇతరులకు సాక్ష్యమిస్తారు. ఒకవేళ మీరు ఆశ్రమంలో ఉంటున్నట్లయితే, అక్కడున్న వైద్య సిబ్బందితో, మిగతావాళ్లతో మాట్లాడవచ్చు.

దావీదు వృద్ధాప్యంలో, సత్యారాధనకు ఎంతో ఉత్సాహంగా మద్దతిచ్చాడు. ఆలయం కట్టడానికి కావాల్సిన విరాళాన్ని ఇచ్చాడు, కావాల్సినవన్నీ సమకూర్చాడు. (1 దిన. 28:11–29:5) మీరుకూడా, ప్రపంచవ్యాప్త ప్రకటనాపనికి మీ వంతు సహాయం చేయవచ్చు. మీ సంఘంలోని పయినీర్లను, ఇతర ఉత్సాహవంతమైన ప్రచారకులను మాటల ద్వారా, చిన్న చిన్న బహుమతులు ఇవ్వడం ద్వారా లేదా అల్పాహారానికి ఆహ్వానించడం ద్వారా ప్రోత్సహించవచ్చు. అలాగే యౌవనుల్ని, వాళ్ల కుటుంబాల్ని, పూర్తికాల సేవకుల్ని, ఆరోగ్యం బాగోలేనివాళ్లను, సంఘంలో బాధ్యతలు నిర్వహిస్తున్నవాళ్లను మీ ప్రార్థనలో గుర్తుచేసుకోవచ్చు.

యెహోవా మిమ్మల్నీ, మీరు చేస్తున్న సేవను ఎంతో అమూల్యంగా ఎంచుతాడు. ఆయన మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టడు. (కీర్త. 71:9) ఆయన మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు, మీరు ఆయనకు ఎంతో విలువైనవాళ్లు. కొద్దికాలంలోనే మనందరం కొత్తలోకంలో ఉంటాం. అప్పుడు మన వయసు పెరుగుతూ ఉంటుంది కానీ, ముసలితనం వల్ల వచ్చే కష్టాలేవీ లేకుండా మనం పూర్తి బలంతో, ఆరోగ్యంతో యెహోవాను నిత్యం సేవిస్తూ ఉంటాం.



# ‘మీ విడుదల సమీపించింది’!

*“మీరు ధైర్యము తెచ్చుకొని మీ తలలెత్తికొనుడి, మీ విడుదల సమీపించుచున్నది.”—లూకా 21:28.*

**పాటలు: 49, 43**

## మీరెలా జవాబిస్తారు?

సా.శ. 66లో జరిగినలాంటి ఏ సంఘటనలు త్వరలో జరగబోతున్నాయి?

“మహాబబులోను” నాశనమైన తర్వాత ఎలాంటి పరీక్షా సమయం ఉంటుంది?

మత్తయి 24:31లో ఉన్న ‘పోగుచేయడం’ దేన్ని సూచిస్తుంది?

మీరు సా.శ. 66లో యెరూషలేములో జీవిస్తున్న ఓ క్రైస్తవుడని అనుకోండి. మీ చుట్టూ ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి. ఫ్లోరస్ అనే ఓ రోమా అధిపతి, ఆలయ ధననిధిలో నుండి 17 తలాంతులు దౌర్జన్యంగా తీసుకెళ్లాడు. దాంతో యూదులు తిరుగుబాటు చేసి, చాలామంది రోమా సైనికుల్ని చంపి, స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. దానికి రోమా ప్రభుత్వం వెంటనే స్పందించింది. మూడు నెలల్లోనే సెస్టీయస్ గాలస్ 30,000 మంది సైనికులతో యెరూషలేమును ముట్టడించాడు. భయపడిపోయిన యూదా తిరుగుబాటుదారులు ఆలయం లోపల దాక్కున్నారు. అయితే రోమా సైనికులు ఆలయం వరకూ వెళ్లి, దాని బయటి గోడను కూలగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. యెరూషలేములోని ప్రతీ ఒక్కరూ ఏమి జరుగుతుందో అని భయంతో వణుకుతున్నారు. వీటన్నిటిని చూస్తుంటే మీకు ఏమనిపిస్తుంది?

2 ఈ దాడి గురించి యేసు తన శిష్యుల్ని చాలా సంవత్సరాల ముందే హెచ్చరించాడు. అంతేకాదు ఆయనిలా ఆజ్ఞాపించాడు,

---

**1.** సా.శ. 66లో ఎలాంటి సంఘటనలు జరిగాయి? (ప్రారంభ చిత్రం చూడండి.)

**2.** రోమా సైన్యం యెరూషలేమును చుట్టుముట్టినప్పుడు క్రైస్తవులు ఏమి చేయాలని యేసు చెప్పాడు? అది వాళ్లకు ఎలా సాధ్యమైంది?

“యెరూషలేము దండ్లచేత చుట్టబడుట మీరు చూచునప్పుడు దాని నాశనము సమీపమై యున్నదని తెలిసికొనుడి. అప్పుడు యూద యలో ఉండువారు కొండలకు పారిపోవలెను; దాని మధ్యనుండువారు వెలుపలికి పోవలెను; పల్లెటూళ్లలోనివారు దానిలో ప్రవేశింపకూడదు.” (లూకా 21:20, 21) పట్టణం చుట్టూ సైనికులు ఉంటే శిష్యులు పారిపోవడం ఎలా సాధ్యం? అయితే ఆశ్చర్యకరంగా రోమా సైన్యం ఉన్నట్టుండి యెరూషలేము నుండి వెళ్లిపోయింది. ఆ విధంగా యేసు చెప్పినట్లే, ఆ దాడి ‘తక్కువ చేయబడింది.’ (మత్త. 24:22) సైన్యం వెనక్కి వెళ్లిపోగానే శిష్యులు యేసు మాటకు లోబడి, నమ్మకమైన తోటి క్రైస్తవులతో కలిసి వెంటనే కొండలకు పారిపోయారు.* ఆ తర్వాత మళ్లీ సా.శ. 70లో మరో రోమా సైన్యం యెరూషలేముపై దాడిచేసి దాన్ని పూర్తిగా నాశనం చేసింది. కానీ యేసు ఇచ్చిన నిర్దేశాలు పాటించినవాళ్లు మాత్రమే బ్రతికి బయటపడ్డారు.

3 యేసు ఇచ్చిన హెచ్చరిక, నిర్దేశాలు మన కాలానికి కూడా వర్తిస్తాయి. ఎందుకంటే అతిత్వరలో మనం కూడా అలాంటి పరిస్థితినే ఎదుర్కోబోతున్నాం. మొదటి శతాబ్దంలో జరిగిన ఆ సంఘటనలు, ‘మహాశ్రమలు’ మొదలైనప్పుడు జరిగే సంఘటనలకు సూచనగా ఉన్నాయి. (మత్త. 24:3, 21, 29) యెరూషలేము నాశనమైనప్పుడు నమ్మకమైన క్రైస్తవులు తప్పించుకున్నట్లే, త్వరలో ఈ లోకంపైకి రాబోతున్న విపత్తును ఓ “గొప్పసమూహము” తప్పించుకుంటుంది. (**ప్రకటన 7:9, 13-14 చదవండి.**) త్వరలో జరగబోయే ఈ సంఘటనల గురించి బైబిలు ఏమి చెప్తుందో తెలుసుకోవడం చాలా ప్రాముఖ్యం. ఎందుకంటే, మన జీవితాలు దానిమీదే ఆధారపడివున్నాయి. కాబట్టి ఈ సంఘటనలు వ్యక్తిగతంగా మనపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో ఇప్పుడు పరిశీలిద్దాం.

## మహాశ్రమలు మొదలైనప్పుడు

4 అబద్ధమతం నాశనమవ్వడంతో మహాశ్రమలు మొదలౌతాయి. బైబిలు అబద్ధమతాన్ని ‘వేశ్యలకు తల్లియైన మహాబబులోను’ అని పిలుస్తుంది. (ప్రక. 17:5-7) బైబిలు అబద్ధమతాన్ని వేశ్యతో ఎందుకు పోలుస్తుంది? ఎందుకంటే అబద్ధమత నాయకులు దేవునికి నమ్మకంగా లేరు. వాళ్లు యేసుకు, ఆయన రాజ్యానికి నమ్మకంగా మద్దతిచ్చే బదులు అధికారం కోసం మానవ ప్రభుత్వాలకు మద్దతిస్తూ, బైబిలు బోధల్ని పక్కనపెట్టేశారు. వాళ్లు అభిషిక్త క్రైస్తవుల్లా దేవున్ని పవిత్రంగా ఆరాధించలేదు. (2 కొరిం. 11:2; యాకో. 1:27; ప్రక. 14:4) ఇంతకీ మహాబబులోనును ఎవరు నాశనం చేస్తారు? ‘ఎర్రని క్రూరమృగానికి’ ఉన్న ‘పది కొమ్ముల్ని’ ఉపయోగించి యెహోవా దాన్ని నాశనం చేస్తాడు. ఆ ‘ఎర్రని క్రూరమృగం’ ఐక్యరాజ్య సమితిని, ఆ “పది కొమ్ములు” దానికి మద్దతిచ్చే రాజకీయ శక్తుల్ని సూచిస్తున్నాయి. —**ప్రకటన 17:3, 16-18 చదవండి.**

5 మహాబబులోను నాశనమైనప్పుడు, దానిలోని సభ్యులందరూ నాశనమౌతారా? అవ్వకపోవచ్చు. అప్పుడు ఏమి జరుగుతుందో యెహోవా జెకర్యా ద్వారా ప్రవచించాడు. అబద్ధమత సభ్యులు ఇలా అంటారు, “‘నేను ప్రవక్తను కాను. నేనొక వ్యవసాయదారుడను. నా చిన్నతనం నుండి నేను వ్యవసాయదారునిగానే పని చేశాను’. ‘అయితే నీ చేతులమీద ఈ గాయాలు ఏమిటి?’ అని ఇతరులు అడుగుతారు. అందుకతడు, ‘నా స్నేహితుల ఇంటిలో నాకు దెబ్బలు తగిలాయి’ అని అంటాడు.” (జెక. 13:4-6, *పరిశుద్ధ బైబల్: తెలుగు ఈజీ-టు-రీడ్ వర్షన్*)

* కావలికోట ఏప్రిల్ 15, 2012 సంచిక 25-26 పేజీలు చూడండి.

**3.** తొలి క్రైస్తవుల్లాగే నేటి క్రైస్తవులు కూడా త్వరలో ఎలాంటి పరిస్థితిని ఎదుర్కోబోతున్నారు? ఈ ఆర్టికల్‌లో మనమేమి పరిశీలిస్తాం?

**4.** మహాశ్రమలు ఎలా మొదలౌతాయి?

**5, 6.** మహాబబులోను నాశనమైనప్పుడు, దాని సభ్యులందరూ నాశనమవ్వరని ఎలా చెప్పవచ్చు?

చివరికి కొంతమంది మతనాయకులు కూడా, అబద్ధమతంతో తాము తెగతెంపులు చేసుకున్నామని, తమకు అసలు దానితో సంబంధమే లేదని చెప్పుకుంటారు.

6 అప్పుడు దేవుని ప్రజలకు ఏమి జరుగుతుంది? యేసు ఇలా చెప్పాడు, "ఆ దినములు తక్కువ చేయబడక పోయినయెడల ఏ శరీరియు తప్పించుకొనడు. **ఏర్పరచబడినవారి నిమిత్తము ఆ దినములు తక్కువ చేయబడును.**" (మత్త. 24:22) సా.శ. 66లో శ్రమ 'తక్కువ చేయబడడం' వల్ల "ఏర్పరచబడినవారు" అంటే అభిషిక్త క్రైస్తవులు తప్పించుకున్నారు. అదేవిధంగా, మహాశ్రమల మొదటి భాగం కూడా 'ఏర్పరచబడినవారి కోసం తక్కువ చేయబడుతుంది.' "పది కొమ్ములు" లేదా రాజకీయ శక్తులు తన ప్రజల్ని నాశనం చేయడానికి యెహోవా అనుమతించడు. అయితే, మహా బబులోను నాశనమైన తర్వాత కొంతకాలం ప్రశాంతత ఉంటుంది.

## పరీక్షా సమయం, తీర్పు

7 ప్రశాంతత ఉండే ఆ కాలంలో, మన హృదయంలో నిజంగా ఏముందో బయటపడుతుంది. అప్పుడు చాలామంది ప్రజలు 'కొండల్లాంటి' మానవ సంస్థలను ఆశ్రయిస్తారు. (ప్రక. 6:15-17) కానీ దేవుని ప్రజలు మాత్రం యెహోవాను ఆశ్రయిస్తారు. మొదటి శతాబ్దంలో శ్రమ 'తక్కువ చేయబడినప్పుడు' యూదులందరూ క్రైస్తవులుగా మారలేదు. కానీ అప్పటికే క్రైస్తవులుగా ఉన్నవాళ్లు, యేసు సలహాను పాటించి యెరూషలేము నుండి పారిపోవడానికి అవకాశం దొరికింది. అదేవిధంగా, మహాశ్రమలు తక్కువ చేయబడినప్పుడు, చాలామంది ప్రజలు నిజక్రైస్తవులుగా మారతారని మనం అనుకోకూడదు. బదులుగా, అప్పటికే నిజక్రైస్తవులైన వాళ్లందరూ యెహోవాపట్ల తమకున్న ప్రేమను నిరూపించుకోవడానికి, అభిషిక్తులకు మద్దతివ్వడానికి అవకాశం దొరుకుతుంది.—మత్త. 25:34-40.

8 ఆ పరీక్షా సమయంలో ఖచ్చితంగా ఏమి జరుగుతుందో మనకు తెలీదు. అయితే జీవితం కష్టంగా ఉంటుందని, మనం కొన్నిటిని వదులుకోవాల్సి వస్తుందని కూడా మనకు తెలుసు. మొదటి శతాబ్దంలో క్రైస్తవులు తమ ఇళ్లను వదిలి వెళ్లాల్సివచ్చింది, బ్రతకడానికి ఎన్నో కష్టాలు పడాల్సివచ్చింది. (మార్కు 13:15-18) అందుకే మనల్ని మనం ఇలా ప్రశ్నించుకోవాలి, 'నాకున్న డబ్బును, వస్తువులను వదిలేయడానికి ఇష్టపడతానా? యెహోవాకు నమ్మకంగా ఉండడం కోసం ఏమి చేయడానికైనా సిద్ధంగా ఉన్నానా?' ఒక్కసారి ఆలోచించండి, అప్పుడు పరిస్థితులు ఎలావున్నా మనం మాత్రమే యెహోవాను ఆరాధిస్తూ ఉంటాం. దానియేలు ప్రవక్త అదే చేశాడు.—దాని. 6:10, 11.

9 మహాశ్రమల కాలం, "రాజ్య సువార్త" ప్రకటించే సమయం **కాదు**. ఆ సందేశాన్ని ప్రకటించాల్సిన సమయం అయిపోయింది. బదులుగా, అది "అంతము" వచ్చే సమయం. (మత్త. 24:14) అప్పుడు దేవుని ప్రజలు ధైర్యంగా శక్తివంతమైన తీర్పు సందేశాన్ని ప్రకటిస్తారు. సాతాను దుష్టలోకం త్వరలో నాశనం కాబోతుందన్నదే ఆ సందేశం. ఈ సందేశాన్ని బైబిలు వడగండ్లతో పోలుస్తూ ఇలా చెప్తుంది, "అయిదేసి మణుగుల బరువుగల పెద్దవడగండ్లు ఆకాశమునుండి మనుష్యులమీద పడెను; ఆ వడగండ్ల దెబ్బ మిక్కిలి గొప్పదైనందున మనుష్యులు ఆ దెబ్బనుబట్టి దేవుని దూషించిరి."—ప్రక. 16:21.

10 ఆ సందేశం మన శత్రువుల చెవిన పడుతుంది. అప్పుడు 'మాగోగువాడగు గోగు' అంటే కొన్ని దేశాల గుంపు ఏమి చేస్తుందో యెహోవా

**7, 8.** అబద్ధమతం నాశనమైన తర్వాత ఏ అవకాశం దొరుకుతుంది? అప్పుడు దేవుని ప్రజలు ఎలా ఇతరులకన్నా భిన్నంగా ఉంటారు?

**9, 10.** (ఎ) మహాశ్రమల కాలంలో దేవుని ప్రజలు ఏ సందేశాన్ని ప్రకటిస్తారు? (బి) దానికి వాళ్ల శత్రువులు ఎలా స్పందిస్తారు?

యెహెజ్కేలు ప్రవక్త ద్వారా ఇలా తెలియజేశాడు, 'ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా—ఆ కాలంలో నీ మనసులో అభిప్రాయాలు పుడతాయి, నువ్వు దురాలోచనచేసి ఇలా అనుకుంటావు—నేను ప్రాకారాలులేని గ్రామాలు గల దేశం మీదికి వెళ్తాను, ప్రాకారాలు అడ్డగడియలు, గవునులు లేని దేశము మీదికి వెళ్తాను, నిమ్మళంగా నిర్భయంగా నివసించేవాళ్ల మీదికి వెళ్తాను. వాళ్లను దోచుకొని కొల్లసొమ్ముగా పట్టుకోవడానికి, పూర్వం పాడై మళ్లీ నివసించబడిన స్థలాల మీదికి తిరిగి వెళ్తాను, ఆయా జనములలో నుండి సమకూర్చబడి, పశువులు, సరుకులు కలిగి, భూమి నట్టనడుమ నివసించే జనుల మీదికి తిరిగి వెళ్తాను.' (యెహె. 38:10-12) దేవుని ప్రజలు "భూమి నట్టనడుమ" ఉన్నట్లుగా, అంటే ప్రజలందరికన్నా ప్రత్యేకంగా ఉన్నట్లు కనిపిస్తారు. దాంతో గోగు ఆత్రంగా అభిషిక్తులమీద, వాళ్లకు మద్దతిస్తున్న వాళ్లమీద దాడి చేస్తాడు.

11 తర్వాత ఏమి జరుగుతుంది? ఆ తర్వాత జరిగే సంఘటనలు ఖచ్చితంగా ఏ క్రమంలో జరుగుతాయో బైబిలు చెప్పడం లేదు. బహుశా కొన్ని సంఘటనలు ఒకే సమయంలో జరగవచ్చు. యుగసమాప్తికి సంబంధించిన ప్రవచనంలో యేసు ఇలా చెప్పాడు, "సూర్య చంద్ర నక్షత్రములలో సూచనలును, భూమిమీద సముద్రతరంగముల ఘోషవలన కలవరపడిన జనములకు శ్రమయు కలుగును. ఆకాశమండలి శక్తులు కదిలింపబడును గనుక లోకము మీదికి రాబోవుచున్న వాటివిషయమై భయము కలిగి, మనుష్యులు ఎదురుచూచుచు ధైర్యము చెడి కూలుదురు. అప్పుడు మనుష్యకుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను మేఘారూఢుడై వచ్చుట చూతురు." (లూకా 21:25-27; **మార్కు 13:24-26** చదవండి.) ఈ ప్రవచన నెరవేర్పులో భాగంగా ఆకాశంలో భయపెట్టే సూచనలు, సంఘటనలు జరుగుతాయా? మనం వేచి చూడాల్సిందే. అయితే ఆ సూచనల్ని చూసి మన శత్రువులు భయపడిపోతారు.

12 యేసు 'ప్రభావముతో మహా మహిమతో' వచ్చినప్పుడు ఏమి జరుగుతుంది? నమ్మకంగా ఉన్నవాళ్లకు ప్రతిఫలమిచ్చి, నమ్మకంగా లేని వాళ్లను శిక్షిస్తాడు. (మత్త. 24:46, 47, 50, 51; 25:19, 28-30) దీన్ని వివరించడానికి యేసు ఈ ఉపమానం చెప్పాడు, "తన మహిమతో మనుష్యకుమారుడును ఆయనతోకూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనముమీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జనములు ఆయనయెదుట పోగు చేయబడుదురు; గొల్లవాడు మేకలలో నుండి గొఱ్ఱెలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరుపరచి తన కుడివైపున గొఱ్ఱెలను ఎడమవైపున మేకలను నిలువబెట్టును." (మత్త. 25:31-33) గొర్రెలకు, మేకలకు ఏమి జరుగుతుంది? యేసు వాళ్లకు తీర్పుతీరుస్తాడు. మేకలు అంటే నమ్మకంగా లేనివాళ్లు "నిత్యశిక్షను," గొర్రెలు అంటే నమ్మకంగా ఉన్నవాళ్లు నిత్య జీవాన్ని పొందుతారు.—మత్త. 25:46.

13 తాము నాశనం అవుతామని తెలుసుకున్నప్పుడు మేకల్లాంటి ప్రజలు ఎలా స్పందిస్తారు? వాళ్లు దుఃఖంతో 'రొమ్ము కొట్టుకుంటారు.' (మత్త. 24:30) మరి అభిషిక్తుల, వాళ్లకు మద్దతిచ్చేవాళ్ల సంగతేంటి? "ఇవి జరుగ నారంభించినప్పుడు మీరు ధైర్యము తెచ్చుకొని మీ తలలెత్తికొనుడి, మీ విడుదల సమీపించుచున్నది" అని యేసు చెప్పినట్లు వాళ్లు ధైర్యంగా ఉంటారు.—లూకా 21:28.

**11.** (ఎ) మహాశ్రమల కాలంలో జరిగే సంఘటనల క్రమం గురించి మనం ఏ విషయాన్ని గుర్తుంచుకోవాలి? (బి) ఆకాశంలో కనిపించే సూచనలు, సంఘటనలు చూసి ప్రజలు ఎలా స్పందిస్తారు?

**12, 13.** (ఎ) యేసు 'ప్రభావముతో మహా మహిమతో' వచ్చినప్పుడు ఏమి జరుగుతుంది? (బి) అప్పుడు దేవుని ప్రజలు ఎలా స్పందిస్తారు?



రక్షణ పొందుతామనే నమ్మకంతో మనం ధైర్యంగా ఉండొచ్చు
(12, 13 పేరాలు చూడండి)

## రాజ్యంలో సూర్యునివలె తేజరిల్లుతారు

14 మాగోగువాడగు గోగు దేవుని ప్రజలమీద దాడి చేయడం మొదలుపెట్టిన తర్వాత ఏమి జరుగుతుంది? అప్పుడు మనుష్యకుమారుడు 'దూతలను పంపించి భూలోకం మొదలుకొని ఆకాశం వరకు నలుదిశల నుండి తాను ఎన్నుకొన్నవాళ్లను పోగుచేయించును' అని బైబిలు చెప్తుంది. (మార్కు 13:27; మత్త. 24:31) ఈ 'పోగుచేయడం' అభిషిక్తులను ఎంపిక చేయడాన్నిగానీ, భూమ్మీద మిగిలివున్న అభిషిక్తులు చివరి ముద్ర పొందడాన్నిగానీ సూచించట్లేదు. (మత్త. 13:37, 38) వాళ్లు మహాశ్రమలు మొదలవ్వడానికి కొంచెం ముందే చివరి ముద్రను పొందివుంటారు. (ప్రక. 7:1-4) మరి ఆ పోగుచేయడం దేన్ని సూచిస్తుంది? భూమ్మీద మిగిలివున్న అభిషిక్తులు పరలోక బహుమానం పొందడాన్ని అది సూచిస్తుంది. (1 థెస్స. 4:15-17; ప్రక. 14:1) గోగు దాడి మొదలైన తర్వాత ఏదో ఒక సమయంలో వాళ్లు ఆ బహుమానాన్ని పొందుతారు. (యెహె. 38:11) అప్పుడు యేసు చెప్పినట్లు, "నీతిమంతులు ***తమ తండ్రి రాజ్యములో*** సూర్యునివలె తేజరిల్లుదురు."—మత్త. 13:43.*

15 తాము మానవ శరీరాలతోనే పరలోకానికి ఎత్తబడతామని క్రైస్తవమత సామ్రాజ్యంలోని చాలామంది అనుకుంటారు. అంతేకాదు, యేసు భూమిని పరిపాలించడానికి వచ్చినప్పుడు ఆయన్ను చూస్తామని కూడా వాళ్లు అనుకుంటారు. అయితే, యేసు రాకడ అదృశ్యంగా ఉంటుందని బైబిలు స్పష్టంగా చెప్తుంది. "మనుష్యకుమారుని సూచన ఆకాశమందు కన

**14, 15.** మాగోగువాడగు గోగు దాడి మొదలైన తర్వాత ఏమి జరుగుతుంది? అభిషిక్తులు ఎలా పోగుచేయబడతారు?

* కావలికోట జూలై 15, 2013 సంచిక 13-14 పేజీలు చూడండి.

బడును” అని, యేసు ‘మేఘారూఢుడై వస్తాడు’ అని బైబిలు చెప్తుంది. (మత్త. 24:30) “రక్తమాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొననేరవు” అని కూడా చెప్తుంది. కాబట్టి వాళ్లు ‘ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మార్పు పొంది’ పరలోకానికి వెళ్తారు.* (**1 కొరింథీయులు 15:50-53 చదవండి.**) అవును, భూమ్మీద మిగిలివున్న నమ్మకమైన అభిషిక్తులందరూ రెప్పపాటున పోగుచేయబడతారు.

16 అభిషిక్తులందరూ పరలోకానికి వెళ్లిన తర్వాత, గొర్రెపిల్ల వివాహానికి చివరి ఏర్పాట్లు మొదలౌతాయి. (ప్రక. 19:9) అయితే, ఆ వివాహానికి ముందు మరో సంఘటన జరుగుతుంది. అభిషిక్తులు ఇంకా భూమ్మీదున్నప్పుడే, గోగు దేవుని ప్రజలమీద దాడి చేయడం మొదలుపెట్టాడని గుర్తుతెచ్చుకోండి. (యెహె. 38:16) అప్పుడు దేవుని ప్రజలు ఏమి చేస్తారు? వాళ్లు ఈ సలహాను పాటిస్తారు, ‘ఈ యుద్ధంలో మీరు పోరాడాల్సిన అవసరం లేదు. మీరు యుద్ధపంక్తులు తీర్చి నిలబడండి. మీతోకూడ ఉన్న యెహోవా దయచేసే రక్షణను మీరు చూస్తారు. భయపడకండి జడియకండి.’ (2 దిన. 20:17) గోగు దాడి మొదలైన తర్వాత ఏదో ఒక సమయంలో, భూమ్మీద మిగిలివున్న అభిషిక్తులు పరలోకానికి వెళ్తారు. అప్పుడు యేసు ఏమి చేస్తాడో ప్రకటన 17:14 చెప్తుంది. దేవుని ప్రజల శత్రువులు ‘గొర్రెపిల్లతో యుద్ధం చేస్తారు, కానీ గొర్రెపిల్ల ప్రభువులకు ప్రభువు, రాజులకు రాజు గనుక విజయం పొందుతాడు. **ఆయన వెంట ఆయన పిలిచిన వాళ్లు, ఆయన ఎన్నుకొన్నవాళ్లు, ఆయన్ని విశ్వసించే వాళ్లు ఉంటారు.**’ (*పరిశుద్ధ బైబల్: తెలుగు ఈజీ-టు-రీడ్ వర్షన్*) అలా యేసూ 1,44,000 మంది సహరాజులూ కలిసి భూమ్మీదున్న దేవుని ప్రజల్ని కాపాడతారు.

17 వాళ్లు దేవుని ప్రజల్ని కాపాడడం కోసం హార్‌మెగిద్దోను యుద్ధం చేస్తారు. ఆ యుద్ధం యెహోవా పరిశుద్ధ నామాన్ని మహిమపరుస్తుంది. (ప్రక. 16:14-16) మేకలుగా తీర్పు పొందినవాళ్లు, అంటే నమ్మకంగాలేని వాళ్లందరూ నాశనమౌతారు. అప్పుడు ఇక భూమ్మీద చెడ్డవాళ్లే ఉండరు. ‘గొప్పసమూహం’ హార్‌మెగిద్దోనును తప్పించుకుంటుంది. చివరిగా, గొర్రెపిల్ల వివాహంతో ప్రకటన గ్రంథం సంతోషకరమైన ముగింపుకొస్తుంది. (ప్రక. 21:1-4)* హార్‌మెగిద్దోనును తప్పించుకున్న వాళ్లందరూ దేవుని అనుగ్రహం పొంది, ఆయన ప్రేమతో ఇచ్చేవాటిని అనుభవిస్తారు. ఆ గొప్ప పెళ్లి విందు కోసం మనందరం ఆశతో ఎదురుచూద్దాం.—**2 పేతురు 3:13 చదవండి.**

18 ఇలాంటి ఉత్తేజకరమైన సంఘటనలు త్వరలో జరగబోతున్నాయి కాబట్టి మనలో ప్రతీ ఒక్కరం ఏమి చేయాలి? అపొస్తలుడైన పేతురు ఇలా రాశాడు, ‘ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక, దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతో, భక్తితో, ఎంతో జాగ్రత్తగలవారై ఉండాలి . . . ప్రియులారా, వీటికొరకు మీరు కనిపెట్టువారు గనుక శాంతముగలవారై, ఆయన దృష్టికి నిష్కళంకులుగా, నిందారహితులుగా కనబడునట్లు జాగ్రత్తపడండి.’ (2 పేతు. 3:11-12, 14) కాబట్టి మనం దేవున్ని పరిశుద్ధంగా ఆరాధిస్తూ, సమాధానాధిపతి అయిన యేసుక్రీస్తుకు మద్దతిద్దాం.

---

* ఆ సమయంలో జీవిస్తున్న అభిషిక్తులు భౌతిక శరీరాలతో పరలోకానికి వెళ్లరు. (1 కొరిం. 15:48, 49) యెహోవా యేసు శరీరాన్ని లేకుండా చేసినట్టే, బహుశా వాళ్ల శరీరాల్ని కూడా లేకుండా చేస్తాడు.

* సంఘటనలు ఏ క్రమంలో జరుగుతాయో 45వ కీర్తన చెప్తుంది. రాజు ముందు యుద్ధం చేస్తాడు, తర్వాత వివాహం జరుగుతుంది.

---

**16, 17.** గొర్రెపిల్ల వివాహానికి ముందు ఏమి జరుగుతుంది?

**18.** త్వరలో ఉత్తేజకరమైన సంఘటనలు జరగబోతున్నాయి కాబట్టి మనం ఏమి చేయాలని నిశ్చయించుకోవాలి?

# మీరు చేస్తున్న పనిని మనుషులు గుర్తించాలా?

**బెసలేలు,** అహోలీయాబులకు నిర్మాణ పని కొత్తేమీ కాదు. వాళ్లు ఐగుప్తులో బానిసలుగా ఉన్నప్పుడు, లెక్కలేనన్ని ఇటుకలు తయారు చేసివుంటారు. కానీ అదంతా ఒకప్పుడు. ఇప్పుడు వాళ్లకు అత్యంత గొప్ప పనిలో అంటే ప్రత్యక్ష గుడారాన్ని నిర్మించడంలో నాయకత్వం వహించే బాధ్యత అప్పగించబడింది. (నిర్గ. 31:1-11) కానీ వాళ్లు చేసిన అద్భుతమైన వస్తువుల్ని కొంతమంది మాత్రమే చూడగలిగారు. మరి తమకు తగిన గుర్తింపు రాలేదని వాళ్లు బాధపడ్డారా? వాళ్ల పనిని ఎవరు చూశారన్నది అంత ప్రాముఖ్యమా? మీ కష్టాన్ని మనుషులు గుర్తించాలా?

## కొంతమంది మాత్రమే చూశారు

ప్రత్యక్ష గుడారంలోని కొన్ని వస్తువులు అద్భుతమైన కళాఖండాలు. ఉదాహరణకు, నిబంధన మందసంపై ఉన్న బంగారపు కెరూబుల గురించి ఒక్కసారి ఆలోచించండి. అపొస్తుడైన పౌలు వాటిని "మహిమగల కెరూబులు" అని వర్ణించాడు. (హెబ్రీ. 9:5) బంగారంతో చేసిన ఆ కెరూబులు ఎంత అద్భుతంగా ఉండివుంటాయో కదా!—నిర్గ. 37:7-9.

బెసలేలు, అహోలీయాబు చేసిన కళాఖండాలు ఇప్పుడు గనుక దొరికితే, ఖచ్చితంగా వాటిని పెద్దపెద్ద మ్యూజియమ్‌లలో పెడతారు, చాలామంది వాటిని చూసి మెచ్చుకుంటారు. కానీ, ఆ కాలంలో వాటిని నిజంగా ఎంతమంది చూసివుంటారు? కెరూబులు అతిపరిశుద్ధ స్థలంలో ఉండేవి. కాబట్టి ప్రధాన యాజకుడు మాత్రమే, అది కూడా సంవత్సరానికి ఒక్కసారి ప్రాయశ్చిత్తార్థ దినాన మాత్రమే వాటిని చూసేవాడు. (హెబ్రీ. 9:6, 7) కాబట్టి కొంతమందే వాటిని చూశారు.

## ఇతరులు గుర్తించకపోయినా సంతృప్తితో ఉండండి

ఒకవేళ మీరే బెసలేలు లేదా అహోలీయాబు అయ్యుంటే, మీరెంతో కష్టపడి చేసిన ఆ అద్భుతమైన కళాఖండాల్ని కొద్దిమందే చూశారని తెలిస్తే ఎలా భావించి ఉండేవాళ్లు? నేడు చాలామంది ప్రజలు, తాము చేసినవాటిని తోటివాళ్లు పొగిడితే, మెచ్చుకుంటే చాలా గొప్పగా భావిస్తారు. ఇతరులు తమ పనుల్ని ఎంత గుర్తిస్తే తమ కష్టానికి అంత విలువుంటుందని వాళ్లు అనుకుంటారు. అయితే యెహోవా సేవకులమైన మనం అలా అనుకోం. బెసలేలు అహోలీయాబుల్లాగే మనం కూడా యెహోవా చెప్పిన పని చేయడంలో, ఆయన అనుగ్రహం పొందడంలో సంతోషిస్తాం.

యేసు కాలంలోని మతనాయకులు, ఇతరుల గుర్తింపు పొందడం కోసమే ప్రార్థనలు చేసేవాళ్లు. కానీ, మనం ఇతరుల్ని మెప్పించాలనే ఉద్దేశంతో కాకుండా మనస్ఫూర్తిగా ప్రార్థించాలని యేసు చెప్పాడు. అప్పుడే "రహస్యమందు











మీరు వినయంతో, ఇష్టపూర్వకంగా చేస్తున్న సేవను మనుషులెవరూ చూడకపోయినా **యెహోవా** చూస్తాడు!

చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును” అని ఆయన అన్నాడు. (మత్త. 6:5, 6) కాబట్టి మన ప్రార్థనల గురించి వేరేవాళ్లు ఏమనుకుంటున్నారు అనేది కాదుగానీ **యెహోవా** ఏమనుకుంటున్నాడు అనేదే ముఖ్యం. **ఆయన** ఏమనుకుంటున్నాడనే దాన్నిబట్టే మన ప్రార్థనలకు విలువ ఉంటుంది. యెహోవా సేవలో మనం చేసే ఏ పనికైనా ఇదే వర్తిస్తుంది. ఇతరులు మనల్ని పొగిడినప్పుడు కాదుగానీ, ‘రహస్యమందు చూసే’ యెహోవాను సంతోషపెట్టినప్పుడే దాని విలువ పెరుగుతుంది.

గుడారాన్ని నిర్మించడం పూర్తయ్యాక, “మేఘము ప్రత్యక్షపు గుడారమును కమ్మగా యెహోవా తేజస్సు మందిరమును నింపెను” అని బైబిలు చెప్తుంది. (నిర్గ. 40:34, 35) దాన్నిబట్టి బెసలేలు, అహోలీయాబుల పనిని యెహోవా ఆమోదించాడని స్పష్టంగా తెలుస్తుంది. ఆ క్షణం వాళ్లకు ఎలా అనిపించివుంటుంది? ఆ వస్తువుల మీద తమ పేర్లు చెక్కకపోయినా, యెహోవా తమ కష్టాన్నంతటినీ ఆశీర్వదించాడని తెలుసుకుని వాళ్లు ఎంతో సంతృప్తి పడివుంటారు. (సామె. 10:22) వాటిని ఆ తర్వాత సంవత్సరాల్లో కూడా యెహోవా ఆరాధనలో ఉపయోగించడం చూసి ఖచ్చితంగా ఆనందించి ఉంటారు. కొత్తలోకంలో వాళ్లు తిరిగి బ్రతికినప్పుడు, ప్రత్యక్ష గుడారాన్ని ప్రజలు దాదాపు 500 సంవత్సరాలపాటు సత్యారాధనలో ఉపయోగించారనే విషయం తెలుసుకుని తప్పకుండా సంతోషిస్తారు.

నేడు యెహోవా సంస్థలో, యానిమేషన్ వీడియోలు చేసేవాళ్లు, చిత్రకారులు, సంగీతకారులు, ఫోటోగ్రాఫర్లు, అనువాదకులు, రచనా విభాగంలో పనిచేసేవాళ్లు ఉన్నారు. వాళ్లెవరూ గుర్తింపును కోరుకోరు. ఆ విధంగా వాళ్లు ఏ పని చేస్తున్నారో ఎవరూ “చూడరు.” ప్రపంచవ్యాప్తంగా 1,10,000కు పైగా ఉన్న సంఘాల్లో జరుగుతున్న పని విషయంలో కూడా ఇది నిజం. ఉదాహరణకు, సంఘంలో అకౌంట్స్ చూసుకునే సహోదరుడు ప్రతినెలా చివర్లో ఎంతో పని చేస్తాడు. కార్యదర్శి, సంఘ క్షేత్రసేవా రిపోర్టులను తయారు చేసేటప్పుడు చాలా ప్రయాసపడతాడు. రాజ్యమందిరంలో ఏదైనా రిపేరు చేయాల్సి వచ్చినప్పుడు ఓ సహోదరుడు/సహోదరి ఎంతో కష్టపడి పనిచేస్తారు. వీళ్లందరూ చేస్తున్న పనిని ఎవరు చూస్తున్నారు?

నాణ్యమైన, అద్భుతమైన కళాఖండాలను చేసినందుకు గుర్తింపుగా బెసలేలు అహోలీయాబులు ట్రోఫీలు లేదా మెడల్స్ అందుకోలేదు. లేదా శిలాఫలకాల మీద వాళ్ల పేర్లను చెక్కించలేదు. కానీ వాటన్నిటికన్నా ఎంతో విలువైన యెహోవా అనుగ్రహాన్ని వాళ్లు పొందారు. వాళ్లు చేసిన పనిని యెహోవా గుర్తించాడు. మనం కూడా వాళ్లలాగే వినయంగా, ఇష్టపూర్వకంగా యెహోవా సేవ చేద్దాం.




# దేవుని రాజ్యానికి నమ్మకంగా ఉండండి

*‘వాళ్లు లోకసంబంధులు కాదు.’*—యోహా. 17:16.

**పాటలు: 18, 54**

## మీరు జవాబివ్వగలరా?

ఒక జాతికంటే మరో జాతి గొప్పదని యేసు ఎందుకు అనుకోలేదు?

మనం దేవుని రాజ్యానికే ఎందుకు మద్దతిస్తాం?

యెహోవాకు, ఆయన రాజ్యానికి నమ్మకంగా ఉండేలా మనకు మనం ఎలా శిక్షణ ఇచ్చుకోవచ్చు?

యెహోవాసాక్షులు జాతి, తెగ, నేపథ్యం వంటివాటికి సంబంధించిన వివాదాల్లో తలదూర్చరు. ఎందుకు? ఎందుకంటే మనం యెహోవాను ప్రేమిస్తాం, ఆయనకే నమ్మకంగా ఉంటూ లోబడతాం. (1 యోహా. 5:3) మనం ఏ దేశానికి, ప్రాంతానికి లేదా సంస్కృతికి చెందినవాళ్లమైనా, యెహోవా ప్రమాణాలను పాటిస్తాం. మనం అన్నిటికన్నా ఎక్కువగా యెహోవాకూ, ఆయన రాజ్యానికే నమ్మకంగా ఉంటాం. (మత్త. 6:33) అందుకే మనం ‘లోకసంబంధులుగా’ ఉండం.—**యోహాను 17:11, 15-16 చదవండి;** యెష. 2:4.

2 నేడు లోకంలో చాలామంది తమ దేశానికి, జాతికి, సంస్కృతికి, ఆఖరికి తమ క్రీడా జట్టుకు కూడా నమ్మకంగా ఉంటారు. దానివల్ల ప్రజల్లో పోటీతత్వం, ద్వేషం పెరిగిపోయి, చివరికి అవతలి వాళ్లను చంపడానికి కూడా వెనకాడడం లేదు. మనం అలాంటి పోరాటాల్లో పాల్గొనకపోయినా అవి మనమీద, మన కుటుంబం మీద ప్రభావం చూపించవచ్చు, కొన్నిసార్లు మనకు ఘోరమైన అన్యాయం కూడా జరగవచ్చు. అయితే, ఏది న్యాయమో ఏది అన్యాయమో గుర్తించే సామర్థ్యాన్ని యెహోవా మన

**1, 2.** (ఎ) మనం యెహోవాకు నమ్మకంగా ఉన్నప్పుడు లోక వ్యవహారాల విషయంలో ఎలా ఉంటాం? (ప్రారంభ చిత్రం చూడండి.) (బి) చాలామంది వేటికి నమ్మకంగా ఉంటారు? దాని ఫలితం ఏమిటి?

కిచ్చాడు కాబట్టి ప్రభుత్వం అన్యాయంగా ప్రవర్తించినప్పుడు దాని వ్యతిరేక పార్టీకి మద్దతివ్వాలని మనకనిపించవచ్చు. (ఆది. 1:27; ద్వితీ. 32:4) మరి అలాంటి అన్యాయం జరిగినప్పుడు మీరేమి చేస్తారు? తటస్థంగా ఉంటారా లేక ఎవరో ఒకరికి మద్దతిస్తారా?

3 పోరాటాలు జరిగేటప్పుడు చాలామంది ప్రజలు ఏదో ఒక పార్టీకి మద్దతిస్తారు. అలా మద్దతిచ్చేవాళ్లే మంచి పౌరులని ప్రభుత్వాలు చెప్తుంటాయి. కానీ మనం యేసును అనుకరిస్తాం కాబట్టి రాజకీయాల్లోగానీ, యుద్ధాల్లోగానీ పాల్గొనం. (మత్త. 26:52) సాతాను లోకంలోని ఒక పార్టీ మరో పార్టీకన్నా మంచిదని మనం అనుకోం. (2 కొరిం. 2:11) కాబట్టి మనం ఈ లోక పోరాటాల్లో తలదూర్చం.—**యోహాను 15:18, 19 చదవండి.**

4 మనం అపరిపూర్ణులం కాబట్టి వేరే దేశానికి, జాతికి లేదా భాషకు చెందినవాళ్ల మీద మనకు ఒకప్పుడు చెడు అభిప్రాయాలు ఉండివుంటాయి. వాటిని తీసేసుకోవడానికి మనలో కొంతమందిమి ఇప్పటికీ కృషి చేస్తుండవచ్చు. (యిర్మీ. 17:9; ఎఫె. 4:22-24) అందుకు సహాయం చేసే కొన్ని సూత్రాలను ఈ ఆర్టికల్‌లో చూద్దాం. అలాగే మనం యెహోవాలా, యేసులా ఆలోచించడానికి కృషిచేయడం ద్వారా రాజ్యానికి ఎలా నమ్మకంగా ఉండవచ్చో కూడా పరిశీలిద్దాం.

## మనమెందుకు లోక వ్యవహారాల్లో జోక్యం చేసుకోం?

5 ఏదైనా ఒక విషయంలో తటస్థంగా ఉండడం కష్టమని మీకనిపిస్తే, 'నా స్థానంలో యేసు ఉంటే ఏమి చేసేవాడు?' అని ఆలోచించండి. ఆయన భూమ్మీద జీవించిన కాలంలో యూదయ, గలిలయ, సమరయ ప్రాంతాల ప్రజలకు ఒకళ్లంటే ఒకళ్లకు పడేది కాదు. ఉదాహరణకు యూదులూ సమరయులూ మాట్లాడుకునేవాళ్లు కాదు. (యోహా. 4:9) పరిసయ్యులకు సద్దూకయ్యులకు చాలా విషయాల్లో అభిప్రాయ భేదాలు ఉండేవి. (అపొ. 23:6-9) ధర్మశాస్త్రాన్ని చదివిన యూదులు తాము ఇతరులకన్నా గొప్పవాళ్లమని అనుకునేవాళ్లు. (యోహా. 7:49) అంతేకాదు యూదులు సుంకరులను ద్వేషించేవాళ్లు. (మత్త. 9:11) అయితే, యేసు వీళ్ల గొడవల్లో ఎప్పుడూ తలదూర్చలేదు. ఆయన యెహోవా గురించిన సత్యాన్ని మాత్రమే సమర్థించాడు. అంతేకాదు, ఇశ్రాయేలీయులు దేవుని ప్రత్యేక జనాంగం అని తెలిసినా, వాళ్లు ఇతరులకన్నా గొప్పవాళ్లని యేసు ఎన్నడూ బోధించలేదు. (యోహా. 4:22) బదులుగా, ప్రజలందర్నీ ప్రేమించమని ఆయన తన శిష్యులకు నేర్పించాడు.—లూకా 10:27.

6 ఒక జాతి మరో జాతికన్నా గొప్పదని యేసు ఎందుకు అనుకోలేదు? ఎందుకంటే యెహోవా, యేసుక్రీస్తు ప్రజల్ని చూసే విధానం వేరు. భూమిని వేర్వేరు జాతుల ప్రజలతో నింపగల సామర్థ్యంతో యెహోవా మనుషుల్ని సృష్టించాడు. (ఆది. 1:27, 28) కాబట్టి యెహోవాగానీ, యేసుగానీ ఫలానా జాతి, దేశం, భాష వేరేవాటి కన్నా గొప్పవని అనుకోరు. (అపొ. 10:34, 35; ప్రక. 7:9, 13, 14) మనం వాళ్లలాగే ఆలోచించాలి.—మత్త. 5:43-48.

7 మనం ఎందుకు మానవ నాయకులకు లేదా ప్రభుత్వాలకు మద్దతివ్వం? ఎందుకంటే మనం యెహోవాకే మద్దతిస్తాం, ఆయనే మన పరిపాలకుడు. కానీ యెహోవా మంచి పరిపాలకుడు కాదని సాతాను నిందమోపాడు. అంతేకాదు దేవుని మార్గాలకన్నా తన మార్గాలే సరైనవని అతను ప్రజల్ని నమ్మిస్తున్నాడు. అయితే మనం ఎవరివైపు ఉంటామో నిర్ణయించుకునే స్వేచ్ఛ యెహోవా మనకే ఇచ్చాడు. మరి మీరేం చేస్తారు? మీ మార్గాలకన్నా యెహోవా మార్గాలే సరైనవని నమ్ముతూ ఆయనకు లోబడతారా?

---

**3, 4.** (ఎ) మనం ఈ లోక పోరాటాల్లో ఎందుకు తలదూర్చం? (బి) ఈ ఆర్టికల్‌లో మనమేమి పరిశీలిస్తాం?

**5, 6.** తన కాలంలోని వేర్వేరు జాతుల ప్రజల విషయంలో యేసుకు ఎలాంటి అభిప్రాయం ఉండేది? ఎందుకు?

**7, 8.** (ఎ) మనం ఎవరికి మద్దతిస్తాం? ఎందుకు? (బి) మనుషుల సమస్యల్ని ఏది మాత్రమే పరిష్కరిస్తుందని మనం గుర్తుంచుకోవాలి?

మన కష్టాల్ని దేవుని రాజ్యం మాత్రమే తీర్చగలదని మీరు నమ్ముతున్నారా లేక, మనుషులు తమను తామే పరిపాలించుకోగలరని అనుకుంటున్నారా?—ఆది. 3:4, 5.

8 ఉదాహరణకు ఫలానా రాజకీయ పార్టీ గురించి, ఉద్యమం లేదా సంస్థ గురించి మీ అభిప్రాయమేంటని ఎవరైనా అడిగితే, మీరేమి చెప్తారు? బహుశా కొన్ని పార్టీలు లేదా సంస్థలు ప్రజలకు సహాయం చేయడానికి నిజంగానే ప్రయత్నిస్తుండవచ్చు. అయితే, దేవుని రాజ్యం మాత్రమే మనం అనుభవిస్తున్న కష్టాల్ని, అన్యాయాల్ని తీసేస్తుందని మనకు తెలుసు. అంతే కాదు, సంఘంలో కూడా మనకు ఇష్టమొచ్చినట్లు నడుచుకునే బదులు మనం యెహోవా నిర్దేశాన్ని పాటిస్తాం. అందువల్లే సంఘం ఐక్యంగా ఉండగలుగుతుంది.

9 మొదటి శతాబ్దంలో కొరింథు సంఘంలోని కొంతమంది, 'నేను పౌలువాడను, నేను అపొల్లోవాడను, నేను కేఫావాడను, నేను క్రీస్తువాడను' అని వాదించుకున్నారు. ఈ విషయం తెలిసినప్పుడు పౌలుకు కోపమొచ్చింది. అలాంటివాళ్ల వల్ల సంఘ ఐక్యత పాడయ్యే ప్రమాదం ఉంది. అందుకే పౌలు వాళ్లను "క్రీస్తు విభజింపబడియున్నాడా?" అని సూటిగా ప్రశ్నిస్తూ ఈ సలహా ఇచ్చాడు, 'సహోదరులారా, మీరందరు ఏక భావంతో మాట్లాడాలని, మీలో కక్షలు లేక ఏక మనస్సుతో ఏకతాత్పర్యముతో, మీరు సన్నద్ధులై ఉండాలని, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మల్ని వేడుకుంటున్నాను.' ఈ సలహా నేటికీ వర్తిస్తుంది. కాబట్టి మనం సంఘంలో ఎలాంటి విభజనలకూ చోటివ్వకూడదు.—1 కొరిం. 1:10-13; **రోమీయులు 16:17, 18** చదవండి.

10 అభిషిక్త క్రైస్తవులకు పరలోక పౌరసత్వం ఉంది కాబట్టి, 'భూసంబంధమైనవాటి మీద' మనసు పెట్టవద్దని పౌలు వాళ్లను ప్రోత్సహించాడు. (ఫిలి. 3:17-20)* అభిషిక్తులు దేవునికి, క్రీస్తుకు రాయబారులు. ఓ రాయబారి వేరే దేశంలో ఉన్నప్పుడు ఆ దేశ వ్యవహారాల్లో, రాజకీయాల్లో తలదూర్చడు. అదేవిధంగా అభిషిక్తులు కూడా ఈ లోక వ్యవహారాల్లో, రాజకీయాల్లో జోక్యం చేసుకోరు. (2 కొరిం. 5:20) అంతే కాదు, భూనిరీక్షణగలవాళ్లు కూడా దేవుని రాజ్యానికి నమ్మకంగా ఉంటారు, ఈ లోక పోరాటాల్లో వాళ్లు ఎవ్వరికీ మద్దతివ్వరు.

## రాజ్యానికి నమ్మకంగా ఉండేలా మీ మనస్సాక్షికి శిక్షణ ఇవ్వండి

11 ప్రపంచంలోని చాలా ప్రాంతాల ప్రజలకు తమ దేశానికి, సంస్కృతికి, భాషకు చెందిన వాళ్లంటే ప్రత్యేక అభిమానం ఉంటుంది. వాళ్లు తమ దేశాన్ని చూసి గర్వపడతారు కూడా. కానీ మనం అలా ఉండకూడదు. బదులుగా మన ఆలోచనా విధానాన్ని మార్చుకుని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి పక్షపాతం చూపించకుండా ఉండేలా మన మనస్సాక్షికి శిక్షణ ఇవ్వాలి. దాన్ని మనమెలా చేయవచ్చు?

12 ఉదాహరణకు, మీర్యేటా# అనే సహోదరి గతంలో యుగోస్లావియా అని పిలువబడిన దేశంలో పుట్టింది. ఆమె ప్రాంతంలోని ప్రజలు సెర్బియన్‌లను ద్వేషించేవాళ్లు. అయితే ఆమె సత్యం తెలుసుకున్నాక, యెహోవా ఒక జాతిని మరో జాతికన్నా గొప్పగా చూడడని గ్రహించింది. అంతేకాదు, ప్రజలు ఒకర్నొకరు ద్వేషించాలని కోరుకునేది సాతానే అని అర్థం చేసుకుంది. దాంతో తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవడానికి ఆమె చాలా కృషి చేసింది. అయితే తన ప్రాంతంలో వేర్వేరు తెగల మధ్య పోరాటం జరిగి

---

* బహుశా, ఫిలిప్పీ సంఘంలోని కొంతమంది క్రైస్తవులకు ఓ విధమైన రోమా పౌరసత్వం ఉండివుంటుంది. దానివల్ల వాళ్లకు, మిగతా సహోదరసహోదరీలకన్నా ఎక్కువ హక్కులు ఉండేవి.

# అసలు పేర్లు కావు.

---

**9.** మొదటి శతాబ్దంలో కొరింథు సంఘంలో ఏ సమస్య ఉండేది? వాళ్లకు పౌలు ఏ సలహా ఇచ్చాడు?

**10.** పౌలు అభిషిక్త క్రైస్తవులను ఏమని ప్రోత్సహించాడు? దానినుండి మనమేమి నేర్చుకోవచ్చు?

**11, 12.** (ఎ) దేవుని రాజ్యానికి నమ్మకంగా ఉండాలంటే ఎలాంటి ఆలోచనలకు దూరంగా ఉండాలి? (బి) ఓ సహోదరి ఎలాంటి సవాలు ఎదుర్కొంది? ఆమె తన ఆలోచనా విధానాన్ని ఎలా మార్చుకుంది?

నప్పుడు ఆమె మళ్లీ సెర్బియన్‌లను ద్వేషించడం మొదలుపెట్టింది. వాళ్లకు అసలు సువార్త ప్రకటించకూడదని అనుకుంది. కానీ అలా ఆలోచించడం తప్పని తెలుసుకొని, తనను సరిదిద్దుకోవడానికి సహాయం చేయమని యెహోవాకు ప్రార్థించింది. పయినీరు సేవ మొదలుపెట్టేందుకు సహాయం చేయమని కూడా అడిగింది. ఆమె ఇలా చెప్తుంది, "పరిచర్య మీద మనసుపెట్టడం నాకు చాలా సహాయం చేసింది. సువార్త ప్రకటిస్తున్నప్పుడు నేను యెహోవాలా ప్రేమ చూపించడానికి ప్రయత్నించాను. దానివల్ల నాకున్న ప్రతికూల ఆలోచనలు మటుమాయం అయిపోయాయి."

13 మెక్సికో దేశానికి చెందిన థాయిలా అనే సహోదరి ప్రస్తుతం యూరప్‌లో నివసిస్తోంది. అక్కడ ఆమె వెళ్తున్న సంఘంలో, లాటిన్ అమెరికాలోని వేరే దేశాలకు చెందిన సహోదరసహోదరీలు కూడా ఉన్నారు. వాళ్లలో కొంతమంది అప్పుడప్పుడు ఆమె దేశాన్ని, అక్కడి ఆచారాలను, సంగీతాన్ని ఎగతాళి చేసేవాళ్లు. అవి విని ఆమె నొచ్చుకున్నా, ఎక్కువగా బాధపడకుండా ఉండేందుకు సహాయం చేయమని యెహోవాకు ప్రార్థించింది. ఒకవేళ ఆమె స్థానంలో మనం ఉంటే ఏమి చేసేవాళ్లం? మన దేశం లేదా రాష్ట్రం గురించి ఎవరైనా తక్కువ చేసి మాట్లాడితే బాధపడకుండా ఉండడానికి మనలో కొంతమందిమి ఇప్పటికీ కృషి చేస్తున్నాం. కాబట్టి ఫలానా వాళ్లు మిగతావాళ్లకన్నా గొప్పవాళ్లు అనిపించేలా మనం ఎప్పుడూ మాట్లాడకూడదు, ప్రవర్తించకూడదు. మనం సహోదరసహోదరీల మధ్య లేదా ఇతరుల మధ్య అలాంటి విభజనలు సృష్టించకూడదు. —రోమా. 14:19; 2 కొరిం. 6:3.

14 యెహోవా సేవకులమైన మనమంతా ఒక్కటే కాబట్టి, ఫలానా ప్రాంతం లేదా దేశం వేరేవాటికన్నా గొప్పవని మనం ఎప్పుడూ అనుకోకూడదు. కానీ మీరు పెరిగిన వాతావరణం, స్నేహితుల ప్రభావం వల్ల మీకు దేశాభిమానం ఉండవచ్చు. దాంతో ఇతర దేశాలకు, సంస్కృతులకు, భాషలకు లేదా జాతులకు చెందినవాళ్లను మీరు అప్పుడప్పుడూ చిన్నచూపు చూస్తుండవచ్చు. అయితే, అలాంటి ఆలోచనల్ని తీసేసుకోవడానికి మీకేది సహాయం చేస్తుంది? తమ దేశాన్ని చూసి గర్వపడేవాళ్లను లేదా ఇతరులకన్నా తామే గొప్పవాళ్లమని అనుకునేవాళ్లను యెహోవా ఎలా చూస్తాడో ఆలోచించండి. ఈ అంశం గురించి మీ వ్యక్తిగత అధ్యయనంలో లేదా కుటుంబ ఆరాధనలో పరిశోధన చేయండి. ఆ తర్వాత, ప్రజల్ని యెహోవా చూసినట్లు చూడడానికి సహాయం చేయమని ఆయనకు ప్రార్థించండి.—**రోమీయులు 12:2 చదవండి.**

15 మనం మంచి మనస్సాక్షితో యెహోవాను ఆరాధించాలని కోరుకుంటాం, కాబట్టి మనం తోటి ఉద్యోగస్థులకు, విద్యార్థులకు, పొరుగువాళ్లకు లేదా బంధువులకు భిన్నంగా ఉంటాం. (1 పేతు. 2:19) అలా ఉన్నందుకు ఇతరులు మనల్ని ద్వేషిస్తారని కూడా యేసు ముందే హెచ్చరించాడు. అయితే మనల్ని వ్యతిరేకించేవాళ్లలో చాలామందికి దేవుని రాజ్యం గురించి తెలీదు. అందుకే, మనం మానవ ప్రభుత్వాలకు కాకుండా దేవుని రాజ్యానికి ఎందుకు నమ్మకంగా ఉంటామో వాళ్లకు అర్థంకాదు.

16 మనం యెహోవాకు నమ్మకంగా ఉండాలంటే, ఇతరులు మనల్ని ఏమన్నా, ఏమి చేసినా ఆయనకే లోబడాలి. (దాని. 3:16-18) ముఖ్యంగా మన యౌవనులకు, తోటివాళ్లలా ప్రవర్తించకుండా ఉండడం కష్టం కావచ్చు. కాబట్టి తల్లిదండ్రులారా, స్కూల్లో ధైర్యంగా ఉండడానికి మీ పిల్లలకు సహాయం చేయండి. బహుశా మీ పిల్లలు జెండా వందనం లేదా దేశభక్తిని చూపే ఇతర ఆచారాలకు దూరంగా ఉండడానికి భయపడుతుండవచ్చు. ఇలాంటి వాటి విషయంలో

**13.** (ఎ) థాయిలా అనే సహోదరి ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొంది? ఆమె ఏమి చేసింది? (బి) ఆ సహోదరి అనుభవం నుండి మనమేమి నేర్చుకోవచ్చు?

**14.** ప్రజల్ని యెహోవా చూసినట్లు చూడడానికి మీకేది సహాయం చేస్తుంది?

**15, 16.** (ఎ) మనం భిన్నంగా ఉన్నందుకు కొంతమంది మనతో ఎలా ప్రవర్తిస్తారు? (బి) తమ పిల్లలు యెహోవాకు నమ్మకంగా ఉండేలా తల్లిదండ్రులు ఎలా సహాయం చేయవచ్చు?

యెహోవా అభిప్రాయం ఏమిటో మీ కుటుంబ ఆరాధనలో చర్చించండి. తమ నమ్మకాలను ఇతరులకు స్పష్టంగా, గౌరవంతో ఎలా చెప్పాలో మీ పిల్లలకు నేర్పించండి. (రోమా. 1:16) అవసరమైతే మీరు వాళ్ల టీచర్లను కలిసి మన నమ్మకాల గురించి వివరించవచ్చు.

## యెహోవా సృష్టి అంతటినీ ఆనందించండి

17 సాధారణంగా మనం నివసిస్తున్న దేశాన్ని, అక్కడి సంస్కృతిని, భాషను, ఆహారాన్ని ఇష్టపడతాం. అయితే "మాదే గొప్పది" అనే స్వభావాన్ని మాత్రం మనం అలవర్చుకోకూడదు. సృష్టిలో ఉన్న వైవిధ్యాలన్నిటినీ యెహోవా మన ఆనందం కోసమే తయారుచేశాడు. (కీర్త. 104:24; ప్రక. 4:10, 11) మరి అలాంటప్పుడు ఇలానే ఉండాలి, ఇలాగే చేయాలి అని పట్టుబట్టడం ఎందుకు?

18 అన్ని జాతులవాళ్లు తన గురించి తెలుసుకుని తనను ఆరాధించాలనీ నిత్యజీవం పొందాలనీ యెహోవా కోరుకుంటున్నాడు. (యోహా. 3:16; 1 తిమో. 2:3, 4) కాబట్టి మన తోటి వాళ్ల అభిప్రాయాలు కాస్త వేరుగా ఉన్నా వాటిని వినడానికీ, ఒప్పుకోవడానికీ మనం ఇష్టపడాలి. అప్పుడే మన జీవితం ఆసక్తికరంగా ఉంటుంది, తోటి సహోదరసహోదరీలతో కూడా ఐక్యంగా ఉంటాం. మనం యెహోవాకు, ఆయన రాజ్యానికి నమ్మకంగా ఉంటాం కాబట్టి ఈ లోక పోరాటాల్లో ఎవ్వరికీ మద్దతివ్వం. అంతేకాక సాతాను లోకంలోని గర్వానికి, పోటీ స్వభావానికి దూరంగా ఉంటాం. వినయంగా, సమాధానంగా ఉండడం నేర్పిస్తున్నందుకు మనం యెహోవాకు ఎంతో కృతజ్ఞులం. అందుకే కీర్తనకర్తలాగే మనం కూడా ఇలా భావిస్తాం: "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము!" —కీర్త. 133:1.

---

**17.** మనం ఎలాంటి స్వభావాన్ని అలవర్చుకోకూడదు? ఎందుకు?

**18.** ఇతరుల్ని యెహోవా చూసినట్లు చూడడంవల్ల ఎలాంటి ప్రయోజనాలు పొందుతాం?

---

యెహోవాకు నమ్మకంగా ఉండాలంటే, ఇతరులు ఏమి చేసినా మనం ఆయనకే లోబడాలి
(15, 16 పేరాలు చూడండి)





# ఇది మన ఆరాధనా మందిరం

*'నీ ఇంటినిగూర్చిన ఆసక్తి నన్ను భక్షించుచున్నది.'*—యోహా. 2:17.

దేవుని ప్రజలకు గతంలోనూ అలాగే ఇప్పుడూ ఆరాధనా స్థలాలు ఉన్నాయి. ఉదాహరణకు, హేబెలు యెహోవాకు బలులు అర్పించడానికి ఓ బలిపీఠాన్ని కట్టివుంటాడు. (ఆది. 4:3, 4) నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, మోషే వంటివాళ్లు కూడా బలిపీఠాల్ని కట్టారు. (ఆది. 8:20; 12:7; 26:25; 35:1; నిర్గ. 17:15) ఇశ్రాయేలీయులు యెహోవా నిర్దేశం ప్రకారం ప్రత్యక్ష గుడారాన్ని నిర్మించారు. (నిర్గ. 25:8) తర్వాత, యెహోవాను ఆరాధించడానికి వాళ్లు ఓ ఆలయాన్ని నిర్మించారు. (1 రాజు. 8:27, 29) బబులోను చెర నుండి తిరిగొచ్చిన తర్వాత యూదులు సమాజమందిరాల్లో క్రమంగా కలుసుకునేవాళ్లు. (మార్కు 6:2; యోహా. 18:20; అపొ. 15:21) మొదటి శతాబ్దంలోనైతే, క్రైస్తవులు తోటి సహోదరుల ఇళ్లల్లో సమకూడేవాళ్లు. (అపొ. 12:12; 1 కొరిం. 16:19) నేడు యెహోవా ప్రజలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేలాది రాజ్యమందిరాల్లో కలుసుకుని ఆయన గురించి నేర్చుకుంటున్నారు, ఆయన్ను ఆరాధిస్తున్నారు.

2 యెరూషలేములోని యెహోవా ఆలయమంటే యేసుకు ఎంతో గౌరవం. ఆలయం మీద ఆయనకున్న ప్రేమను గమనించిన శిష్యులకు, "నీ యింటినిగూర్చిన ఆసక్తి నన్ను భక్షించియున్నది" అని కీర్తనకర్త రాసిన మాటలు గుర్తొచ్చాయి. (కీర్త. 69:9; యోహా. 2:17) అయితే అప్పటి యెరూషలేము ఆలయాన్ని పిలిచినట్లుగా, ఇప్పుడున్న ఏ

**1, 2.** (ఎ) గతంలో యెహోవా సేవకులు ఆయన్ను ఎక్కడ ఆరాధించారు? (బి) యెరూషలేములోని యెహోవా ఆలయం గురించి యేసు ఎలా భావించాడు? (సి) ఈ ఆర్టికల్‌లో ఏమి చర్చిస్తాం?

**పాటలు: 13, 21**

## మీరెలా జవాబిస్తారు?

కూటాల విషయంలో మనమెలా గౌరవం చూపించవచ్చు?

రాజ్యమందిరాల నిర్మాణానికి యెహోవా ప్రజలు ఏయే విధాలుగా సహాయం చేస్తున్నారు?

రాజ్యమందిరాల్ని శుభ్రంగా, సరైన స్థితిలో ఉంచడం ఎందుకు ప్రాముఖ్యం?

రాజ్యమందిరాన్నీ దేవుని ఇల్లు అని పిలవలేము. (2 దిన. 5:13; 33:4) అయినప్పటికీ మనం అక్కడ యెహోవాను ఆరాధిస్తాం కాబట్టి వాటిపట్ల గౌరవం చూపించాలి. కాబట్టి మనం రాజ్యమందిరంలో ఎలా ఉండాలో, దాన్ని సరైన స్థితిలో ఎలా ఉంచాలో, రాజ్యమందిరాల నిర్మాణానికి ఎలా సహాయం చేయాలో తెలియజేసే బైబిలు సూత్రాలను ఈ ఆర్టికల్‌లో చర్చిద్దాం.*

## కూటాల పట్ల గౌరవం చూపించండి

3 యెహోవాను ఆరాధించడానికి ప్రజలు రాజ్యమందిరాల్లోనే కలుసుకుంటారు. కూటాలు యెహోవా ఇచ్చిన ఓ బహుమతి, మనం ఆయనకు మరింత దగ్గరవ్వడానికి అవి సహాయం చేస్తాయి. ఆయన తన సంస్థ ద్వారా ఇస్తున్న ప్రోత్సాహాన్ని, మార్గనిర్దేశాన్ని మనం కూటాల్లోనే పొందుతాం. యెహోవా, ఆయన కుమారుడు ఇస్తున్న ఆహ్వానాన్ని అంగీకరించి మనం కూటాలకు వస్తున్నాం. ప్రతీవారం యెహోవా 'బల్ల వద్ద' భోజనం చేయడం మనకు దొరికిన గొప్ప గౌరవం. దాన్ని మనం ఎప్పుడూ తేలిగ్గా తీసుకోకూడదు. —1 కొరిం. 10:21.

4 మనం మీటింగ్స్‌కు వచ్చి తనను ఆరాధించాలని, ఒకరినొకరం ప్రోత్సహించుకోవాలని యెహోవా కోరుకుంటున్నాడు. (**హెబ్రీయులు 10: 24, 25 చదవండి.**) మనకు యెహోవాపై గౌరవం ఉంది కాబట్టి, చిన్నచిన్న కారణాల వల్ల మీటింగ్స్ మానేయం. బాగా సిద్ధపడి, చక్కని కామెంట్స్ ఇచ్చినప్పుడు మనకు వాటిపట్ల కృతజ్ఞత ఉందని చూపిస్తాం.—కీర్త. 22:22.

5 మనం రాజ్యమందిరంలో ఎలా ఉంటున్నాం, దాన్ని ఎంత శుభ్రంగా ఉంచుతున్నాం అనే దాన్ని బట్టి మనకు యెహోవామీద ఎంత గౌరవముందో తెలుస్తుంది. రాజ్యమందిరం బయట కనిపించే యెహోవా పేరుకు ఘనత వచ్చేలా మనం ప్రవర్తించాలి.—1 రాజులు 8:17తో పోల్చండి.

6 రాజ్యమందిరాల పట్ల మనం చూపించే గౌరవాన్ని ఇతరులు గమనిస్తారు. ఉదాహరణకు టర్కీలోని ఒకాయన ఇలా అన్నాడు, 'రాజ్యమందిరంలోని శుభ్రత, అంతా పద్ధతిగా జరగడం నాకెంతో నచ్చింది. అక్కడున్న వాళ్లంతా హుందాగా బట్టలేసుకున్నారు, ప్రతీ ఒక్కరూ చిరునవ్వు చిందిస్తున్నారు. వాళ్లు నన్ను ఆప్యాయంగా పలకరించారు. అది నన్నెంతో ఆకట్టుకుంది.' ఆయన క్రమంగా కూటాలకు వస్తూ, కొంతకాలానికే బాప్తిస్మం తీసుకున్నాడు. ఇండోనేషియాలోని ఓ నగరంలో, సహోదరులు తమ కొత్త రాజ్యమందిరాన్ని చూడడానికి రమ్మని పొరుగువాళ్లను, నగర మేయర్‌ను, ఇతర అధికారుల్ని ఆహ్వానించారు. ఆ రాజ్యమందిరాన్ని కట్టిన విధానాన్ని, దాని డిజైన్‌ని, అందమైన తోటని చూసి ముగ్ధుడైన మేయర్ ఇలా అన్నాడు, "మీరు ఈ హాలును శుభ్రంగా ఉంచడం చూస్తుంటే, మీ విశ్వాసం నిజమైనదని అర్థమౌతుంది."

7 మీటింగ్స్‌కు రమ్మని మనల్ని ఆహ్వానిస్తున్న యెహోవామీద మనకు గౌరవం ఉంది. అందుకే మీటింగ్స్‌కి ఎలా తయారై వస్తున్నామో, అక్కడ ఎలా ప్రవర్తిస్తున్నామో జాగ్రత్తగా చూసుకోవాలి. అయితే మనం మరీ అతిగా ప్రవర్తించం, అంటే మీటింగ్స్‌లో ఇలాగే ఉండాలన్నట్లు సీరియస్‌గా ఉండం లేదా ఇంట్లో ఉన్నట్లుగా ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించం. నిజమే మనమూ, మనం ఆహ్వానించే ఇతరులూ రాజ్యమందిరంలో ఏ ఇబ్బంది పడకుండా కూటాలు వినాలని యెహోవా కోరుకుంటున్నాడు. అయితే మనం ఏ విధంగానూ మీటింగ్స్ విషయంలో అగౌరవం చూపించకుండా జాగ్రత్తపడాలి. అందుకే మనం అపరిశుభ్రంగా అమర్యాదగా ఉండే బట్టలు వేసుకోం, లేదా మీటింగ్స్ మధ్యలో ఫోన్లో మెసేజ్‌లు పంపించడం, మాట్లాడడం, తినడం-తాగడం లాంటివి

* ఈ ఆర్టికల్ ముఖ్యంగా రాజ్యమందిరాల గురించే మాట్లాడుతున్నా, ఇందులోని విషయాలు అసెంబ్లీ హాళ్లకు, ఇతర ఆరాధనా స్థలాలకు కూడా వర్తిస్తాయి.

**3-5.** మనం రాజ్యమందిరాల్లో ఎందుకు కలుసుకుంటాం? మీటింగ్స్ విషయంలో మన అభిప్రాయం ఎలా ఉండాలి?

**6.** రాజ్యమందిరాల్ని, కూటాలకు హాజరైనవాళ్లను చూసి కొంతమంది ఏమని మెచ్చుకున్నారు? (ప్రారంభ చిత్రం చూడండి.)

**7, 8.** రాజ్యమందిరంలో ఉన్నప్పుడు మనం యెహోవామీద ఎలా గౌరవం చూపించవచ్చు?

చేయం. అంతేకాదు, రాజ్యమందిరంలో పరుగెత్తకూడదని, ఆడుకోకూడదని తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పించాలి.—ప్రసం. 3:1.

8 దేవాలయంలో వ్యాపారం చేస్తున్న కొంతమందిని చూసినప్పుడు, యేసు వాళ్లను కోపపడి అక్కడినుండి వెళ్లగొట్టాడు. (యోహా. 2:13-17) అలాగే రాజ్యమందిరాల్లో మనం యెహోవాను ఆరాధిస్తాం, ఆయన గురించి నేర్చుకుంటాం కాబట్టి, అక్కడ వ్యాపారానికి సంబంధించిన విషయాలు మాట్లాడుకోవడం సరికాదు.—నెహెమ్యా 13:7, 8తో పోల్చండి.

## రాజ్యమందిరాల నిర్మాణానికి సహాయం చేయండి

9 ప్రపంచవ్యాప్తంగా యెహోవా ప్రజలు రాజ్యమందిరాల నిర్మాణంలో ఎంతో కష్టపడి పని చేస్తున్నారు. రాజ్యమందిరాల నమూనాలు గీయడం, వాటిని నిర్మించడం, పాతవాటికి మెరుగులు దిద్దడం వంటి పనులన్నీ స్వచ్ఛంద సేవకులే చేస్తున్నారు. అందువల్ల 1999 నవంబరు 1 నుండి ప్రపంచవ్యాప్తంగా 28,000 కన్నా ఎక్కువ రాజ్యమందిరాల్ని కట్టగలిగాం. అంటే గడిచిన 15 సంవత్సరాల్లో మనం సగటున **రోజుకు** ఐదు అందమైన రాజ్యమందిరాల్ని నిర్మించగలిగాం.

10 యెహోవా సంస్థ, అవసరం ఉన్న ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవకుల సహాయంతో, విరాళాల ద్వారా రాజ్యమందిరాల్ని నిర్మిస్తోంది. డబ్బున్నవాళ్లు, అవసరంలో ఉన్నవాళ్లకు సహాయం చేయవచ్చనే బైబిలు సూత్రాన్ని మనం పాటిస్తాం. (**2 కొరింథీయులు 8:13-15 చదవండి.**) దానివల్ల రాజ్యమందిరాల్ని సొంతంగా నిర్మించుకోలేని సంఘాల కోసం అందమైన రాజ్యమందిరాల్ని నిర్మించగలిగాం.



దేవునిమీద మనకు గౌరవం ఉందో లేదో మన ప్రవర్తన చూపిస్తుంది (7, 8 పేరాలు చూడండి)

11 కోస్టరికాలో ఉన్న ఓ సంఘంలోని సహోదరులు ఇలా రాశారు: “మా కొత్త రాజ్యమందిరం బయట నిలబడినప్పుడు మాకు అదంతా కలలా అనిపించింది! మా కళ్లను మేమే నమ్మలేకపోయాం. కేవలం 8 రోజుల్లోనే మా అందమైన రాజ్యమందిరం నిర్మాణ పనంతా అయిపోయింది. యెహోవా ఆశీర్వాదం, ఆయన సంస్థ చేసిన ఏర్పాట్లు, సహోదరులు ఇచ్చిన మద్దతు వల్లే అది సాధ్యమైంది. ఈ రాజ్యమందిరం నిజంగా యెహోవా మాకిచ్చిన ఓ విలువైన బహుమతి. మాకు చెప్పలేనంత ఆనందంగా ఉంది.” రాజ్యమందిరాన్ని ఇచ్చినందుకు సహోదరసహోదరీలు యెహోవాకు అలా కృతజ్ఞతలు చెప్పడం విన్నప్పుడు మనం ఎంతో ఆనందిస్తాం. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న యెహోవా ప్రజలకు సొంత రాజ్యమందిరాలు ఉన్నందుకు కూడా మనమెంతో సంతోషిస్తున్నాం. రాజ్యమందిరాల నిర్మాణం పూర్తైన వెంటనే, చాలామంది కొత్తవాళ్లు యెహోవా గురించి నేర్చుకోవడానికి మీటింగ్స్‌కు రావడం మొదలుపెడతారు. దీన్నిబట్టి, రాజ్యమందిరాల నిర్మాణంపై యెహోవా ఆశీర్వాదం ఉందని స్పష్టమౌతుంది.—కీర్త. 127:1.

---

**9, 10.** (ఎ) యెహోవా ప్రజలు రాజ్యమందిరాల్ని ఎలా నిర్మించగలుగుతున్నారు? దాని ఫలితం ఏమిటి? (బి) రాజ్యమందిరాల్ని సొంతంగా నిర్మించుకోలేని సంఘాలు ఎలా ప్రయోజనం పొందాయి?

**11.** తమ కొత్త రాజ్యమందిరం గురించి కొంతమంది సహోదరులు ఏమన్నారు? అలాంటి మాటలు విన్నప్పుడు మీకెలా అనిపిస్తుంది?







మన రాజ్యమందిరాన్ని శుభ్రంగా, సరైన స్థితిలో ఉంచుకోవాలి
(16, 18 పేరాలు చూడండి)

12 రాజ్యమందిరాల నిర్మాణానికి మీరు ఎలా సహాయం చేయవచ్చు? వీలైతే వాటిని నిర్మించే పనిలో స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు. దానితో పాటు వాటి నిర్మాణానికి అవసరమైన విరాళాలు కూడా ఇవ్వవచ్చు. ఆ పనికి మద్దతుగా మనం చేయగలిగినదంతా చేసినప్పుడు, ఇవ్వడం వల్ల వచ్చే ఆనందాన్ని ఆస్వాదిస్తాం, మరిముఖ్యంగా యెహోవాను ఘనపరుస్తాం. అలా మనం, ఆరాధనా స్థలాల నిర్మాణానికి ఉత్సాహంగా విరాళమిచ్చిన ప్రాచీన కాలంలోని దేవుని సేవకుల్ని అనుకరిస్తాం.—నిర్గ. 25:2; 2 కొరిం. 9:7.

## మన రాజ్యమందిరాన్ని శుభ్రంగా ఉంచుకుందాం

13 మనం ఆరాధించే దేవుడు పవిత్రుడు, పరిశుద్ధుడు. అన్నీ పద్ధతి ప్రకారం జరగాలని ఆయన కోరుకుంటాడు. అందుకే మన రాజ్యమందిరాన్ని పరిశుభ్రంగా, చక్కగా ఉంచుకోవాలి. (**1 కొరింథీయులు 14:33, 39-40 చదవండి.**) మనం యెహోవాలా పరిశుద్ధంగా ఉండాలంటే మన ఆరాధనను, ఆలోచనల్ని, పనుల్ని పవిత్రంగా ఉంచుకోవడంతోపాటు మన శరీరాల్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.—ప్రక. 19:8.

14 మన రాజ్యమందిరాన్ని శుభ్రంగా, చక్కగా ఉంచుకుంటే ఇతరుల్ని మీటింగ్స్‌కి ఆహ్వానించడానికి ఏమాత్రం వెనకాడం. వాళ్లు మన రాజ్యమందిరానికి వచ్చినప్పుడు, పరిశుభ్రమైన కొత్త లోకం గురించి మనం ప్రకటిస్తున్న సువార్త ప్రకారం జీవిస్తున్నామని తెలుసుకుంటారు. అంతేకాదు, మనం ఆరాధించే దేవుడు పవిత్రుడనీ పరిశుద్ధుడనీ, ఆయన త్వరలోనే భూమిని అందమైన పరదైసుగా మారుస్తాడని వాళ్లు అర్థం చేసుకుంటారు.—యెష. 6:1-3; ప్రక. 11:18.

---

**12.** రాజ్యమందిరాల నిర్మాణానికి మీరెలా సహాయం చేయవచ్చు?
**13, 14.** మన రాజ్యమందిరాన్ని ఎందుకు పరిశుభ్రంగా ఉంచుకోవాలో చూపించే బైబిలు సూత్రాలను వివరించండి.

15 పరిశుభ్రత విషయంలో ప్రజలకు వేర్వేరు అభిప్రాయాలు ఉంటాయి. ఎందుకు? వాళ్లు పెరిగిన వాతావరణం అందుకు ఓ కారణం కావచ్చు. వాళ్లు ఉంటున్న ప్రాంతాల్లో దుమ్ము లేదా మట్టిరోడ్లు ఎక్కువగా ఉండవచ్చు. మరి కొన్ని ప్రాంతాల్లో నీళ్లుగానీ, శుభ్రం చేసే సామాగ్రి గానీ సరిపడా ఉండకపోవచ్చు. అయితే మనం ఏ ప్రాంతంలో ఉన్నా, అక్కడున్న ప్రజలకు శుభ్రత విషయంలో ఎలాంటి అభిప్రాయం ఉన్నా, మనం మాత్రం రాజ్యమందిరాన్ని పరిశుభ్రంగా, పద్ధతిగా ఉంచుకోవాలి. ఎందుకంటే, అది యెహోవాను ఆరాధించే స్థలం.—ద్వితీ. 23:14.

16 మన రాజ్యమందిరాన్ని వీలైనంత పరిశుభ్రంగా ఉంచుకోవాలంటే మనం ఆ పనిని ఓ పద్ధతి ప్రకారం చేయాలి. సంఘపెద్దలు అందుకోసం ఓ పట్టికను తయారుచేయాలి, సరిపడా క్లీనింగ్ సామాగ్రి ఉండేలా చూసుకోవాలి. అలాగే ఆ పని సరిగ్గా జరుగుతుందో లేదో చూసుకోవాలి. కొన్నిటిని ప్రతీ మీటింగ్ తర్వాత శుభ్రం చేయాల్సివుంటుంది, మరికొన్నిటిని అప్పుడప్పుడు శుభ్రం చేయాలి. ఏదేమైనా, రాజ్యమందిరాన్ని శుభ్రం చేసే పనిలో సాయం చేసే గొప్ప అవకాశం మనందరికీ ఉంది.

## రాజ్యమందిరాన్ని సరైన స్థితిలో ఉంచండి

17 రాజ్యమందిరాన్ని సరైన స్థితిలో ఉంచడానికి అప్పుడప్పుడూ కొన్ని రిపేర్లు కూడా చేయించాల్సి ఉంటుంది. గతంలో కూడా యెహోవా ప్రజలు అదే చేశారు. ఉదాహరణకు, యూదా రాజైన యోవాషు కాలంలో ప్రజలు ఆలయం కోసం విరాళాలు ఇచ్చారు. వాటితో ఆలయానికి మరమ్మతులు చేయించమని ఆయన యాజకులకు ఆజ్ఞాపించాడు. (2 రాజు. 12:4, 5) సుమారు 200 సంవత్సరాల తర్వాత, రాజైన యోషీయా కూడా విరాళాల సహాయంతో ఆలయానికి మరమ్మతులు చేయించాడు.—**2 దినవృత్తాంతములు 34:9-11 చదవండి.**

18 ఇళ్లను లేదా వస్తువుల్ని శుభ్రంగా, సరైన స్థితిలో ఉంచడాన్ని తమ దేశ ప్రజలు పెద్దగా పట్టించుకోరని కొన్ని బ్రాంచి కమిటీలు చెప్పాయి. బహుశా అక్కడ చాలామందికి, శుభ్రంగా ఎలా ఉంచుకోవాలో తెలియకపోవడమో సరిపడా డబ్బు లేకపోవడమో అందుకు కారణం కావచ్చు. అయితే రాజ్యమందిరాల విషయానికొస్తే, అవసరమైనప్పుడు వాటిని రిపేరు చేయించకపోతే అవి తొందరగా పాడయ్యే ప్రమాదం ఉంది. అంతే కాదు, రాజ్యమందిరం సరిగ్గా లేకపోతే ప్రజలకు మనమీద మంచి అభిప్రాయం కలుగదు. అలా కాకుండా, రాజ్యమందిరాన్ని సరైన స్థితిలో ఉంచడానికి మనం చేయగలిగినదంతా చేసినప్పుడు యెహోవా నామానికి ఘనత తీసుకొస్తాం. మన సహోదరసహోదరీలు ఇచ్చిన విరాళాలు కూడా వృథా అవ్వకుండా ఉంటాయి.

19 రాజ్యమందిరం ఏ మనిషికో లేదా సంఘానికో చెందింది కాదు, అది యెహోవాకు సమర్పించబడిన ఆరాధనా స్థలం. మనం ఈ ఆర్టికల్‌లో చూసినట్లు, యెహోవా ఆరాధన జరిగే ఈ మందిరాన్ని ఎలా చూసుకోవాలో తెలియజేసే సూత్రాలు బైబిల్లో ఉన్నాయి. మనం యెహోవాను గౌరవిస్తాం కాబట్టి మీటింగ్స్ విషయంలో, రాజ్యమందిరం విషయంలో గౌరవం చూపిస్తాం. అందుకే రాజ్యమందిరాల నిర్మాణానికి సంతోషంగా విరాళాలిస్తాం. అంతేకాదు వాటిని పరిశుభ్రంగా, సరైన స్థితిలో ఉంచడానికి కష్టపడి పనిచేస్తాం. అప్పుడే, యెహోవా మందిరం పట్ల యేసులా మనకు కూడా ఆసక్తి ఉందని చూపిస్తాం.—యోహా. 2:17.

---

**15, 16.** (ఎ) శుభ్రత విషయంలో ప్రజలకు వేర్వేరు అభిప్రాయాలు ఎందుకు ఉంటాయి? రాజ్యమందిరాన్ని ఎందుకు శుభ్రంగా ఉంచుకోవాలి? (బి) క్లీనింగ్ కోసం మీ సంఘంలో ఎలాంటి ఏర్పాట్లు చేశారు? మనందరికీ ఏ గొప్ప అవకాశం ఉంది?

**17, 18.** (ఎ) గతంలో యెహోవా ప్రజలు ఆలయాన్ని చూసుకున్న విధానం నుండి మనమేమి నేర్చుకోవచ్చు? (బి) మనం రాజ్యమందిరాన్ని ఎందుకు సరైన స్థితిలో ఉంచాలి?

**19.** రాజ్యమందిరం పట్ల గౌరవం ఉందని మీరెలా చూపిస్తారు?

# బైబిలు చెప్తున్నట్లు ప్రాచీన ఇశ్రాయేలులో అడవులు విస్తారంగా ఉండేవా?

**వాగ్దాన** దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అడవులు ఉండేవని, చెట్లు “విస్తారముగా” ఉండేవని బైబిలు చెప్తుంది. (1 రాజు. 10:27; యెహో. 17:15, 17-18) కానీ ఇప్పుడు అక్కడ చాలా ప్రాంతాల్లో చెట్లు తక్కువగా ఉండడం చూసి, అసలు బైబిలు చెప్తున్నది నిజమేనా అని విమర్శకులు సందేహించవచ్చు.

*లైఫ్ ఇన్ బిబ్లికల్ ఇశ్రాయెల్* అనే పుస్తకం ఇలా చెప్తుంది, “ప్రాచీన ఇశ్రాయేలులో అడవులు ఇప్పటికన్నా చాలా విస్తారంగా ఉండేవి.” పర్వత ప్రాంతాల్లో ఎక్కువగా అలెప్పో పైన్ చెట్లు (పైనస్ హాలెపెన్సిస్), సింధూర వృక్షాలు (క్వెర్కస్ కాలిప్రినోస్), మస్తకి వృక్షాలు (పిస్టాషియా పాలస్టినా) ఉండేవి. మధ్య పర్వత శ్రేణులకు, మధ్యధరా తీరానికి మధ్యవున్న షెఫేలా అనే పర్వత ప్రాంతంలో మేడిచెట్లు (ఫైకస్ సికోమోరస్) కూడా ఎక్కువగా కనిపించేవి.

ఇప్పుడు ఇశ్రాయేలులోని కొన్ని ప్రాంతాల్లో అసలు చెట్లే లేవని *ప్లాంట్స్ ఆఫ్ ద బైబిల్* అనే పుస్తకం చెప్తుంది. ఎందుకు? అది క్రమక్రమంగా జరిగిన మార్పు అని వివరిస్తూ ఆ పుస్తకం ఇలా చెప్తుంది, ‘మనుషులు వ్యవసాయం కోసం, పశువుల ఆహారం కోసం, ఇంటి నిర్మాణానికి కావాల్సిన కలప కోసం, వంటకు కావాల్సిన కట్టెల కోసం అదేపనిగా అడవులను నరికేస్తున్నారు.’



మేడిపండ్ల గుత్తి

గలిలయలోని బిరియా అడవి (కింద)



© Duby Tal/Albatross/Alamy

ఈ పత్రిక, అలాగే ఇతర ప్రచురణలు www.jw.org వెబ్‌సైట్‌లో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

100 కన్నా ఎక్కువ భాషల్లో ఉన్న నూతనలోక అనువాదం బైబిల్ని మీరు ఆన్‌లైన్‌లో చదువుకోవచ్చు

www.jw.org/te చూడండి లేదా ఈ కోడ్ స్కాన్ చేయండి

w15 07/15-TU
150402